# దేవుని సంపూర్ణత

భక్త్‌సింగ్

# విషయసూచిక


| | | పేజీ |
|---|---|---|
| 1. | దేవుని సంకల్పము | 1 |
| 2. | ప్రతిష్ఠిత వస్త్రములు | 11 |
| 3. | నిలువుటంగీ - నడికట్టు | 16 |
| 4. | నీలవస్త్రము | 21 |
| 5 | ఏఫోదు | 27 |
| 6. | పతకము | 32 |
| 7. | యూదా, ఇశ్శాఖారు, జెబూలూను | 38 |
| 8. | రూబేను, షిమ్యోను, గాదు | 45 |
| 9 | ఎఫ్రాయిము, మనష్షే, బెన్యామీను | 53 |
| 10. | దాను, ఆషేరు, నఫ్తాలి | 63 |
| 11. | ఊరీము తుమ్మీము | 69 |
| 12. | తలపాగా | 75 |

# దేవుని సంపూర్ణత

## 1
## దేవుని సంకల్పము

"......... మీరు దేవుని సంపూర్ణతయందు పూర్ణులగునట్లుగా"
(ఎఫెసీ. 3:16)

దేవుని సర్వ సంపూర్ణతయందు మనము పూర్ణులము కావలయు ననెడి పూర్ణ సంకల్పముతో దేవుడు మనలను రక్షించెనని ఈ కొద్ది మాటలలో ఆత్మద్వారా మనకు జ్ఞాపకము చేయబడుచున్నది. అట్టి సంతోషకరమైన అనుభవమును మనము పొందితేనేగాని దేవునికి తృప్తి కలుగదు. అందువలననే అట్టి సర్వ సంపూర్ణత యందు మనమెట్లు పూర్ణులము కాగలమో చూపించు నిమిత్తము దేవుని వాక్యమియ్యబడినది. మనము పాపము ద్వారా పూర్తిగా పాడుచేయబడి, నిరుపయోగమైన వారముగా, పనికిమాలినవారముగా నుండినను, ప్రశస్త రక్తము యొక్క శక్తివలన ఒక దినమున ఆయన యొక్క సంపూర్ణతతో నింపబడుటకు యోగ్యులముగా చేయబడగలము. ఇది అనేక పర్యాయములు బైబిలులో చెప్పబడినది. "ఆయన యందు మీరును సంపూర్ణులై యున్నారు" అని కొలస్స. 2:10లో చదువుచున్నాము. దేవుని సర్వ పరిపూర్ణత నివసించుచున్న ప్రభువైన యేసుక్రీస్తునందు మనము సంపూర్ణులమై యున్నాము. మనము సమస్తమును సమృద్ధిగా కలిగి యుండవలెనని ఆయన కోరుచుండెను.

ఆ ఉద్దేశముతోనే దేవుడు మొదటి మానవుని కలుగజేసెను. దేవుడు మొదటి మానవునికి సర్వసృష్టిని, భూమిని మాత్రమేగాక పశువులను, ప్రాకుజీవులను, పక్షులను, చేపలను ఏలుటకు శక్తిని, అధికారమును అనుగ్రహించెనని చదువుచున్నాము (ఆదికాండము 1:26 మొదటి మానవుడైన ఆదాము సర్వసృష్టిపై ఏలుబడిని, అధికారము, శక్తిని కలిగియుండ గలుగునట్లు దేవుడు అతనికి ఆరోగ్యవంతమైన బలమైన శరీరము ననుగ్రహించెను. ఆదాము యొక్క ఆరోగ్యమునకు కావలసిన ప్రతి విధమైన ఆహారమును ఆయన ఏర్పాటు చేసెను. ఆయన ఏదెను తోటలో జీవవృక్షమును కూడ నుంచెను (ఆదికాండము 2:9). ఆ సమయములో జీవ వృక్ష ఫలములు తిను అధికృత ఆదామునకుండెను (ఆదికాండము 2:16, 17). ఆ వృక్షఫలములనతడు తిని యుండిన యెడల అతడు సంపూర్ణానందము పొందియుండెడివాడు, దేవుని సంకల్పమును అప్పుడే నెరవేర్చియుండెడివాడు, సృష్టి ఆరంభమునుండి మానవుడు సంపూర్ణానందము పొందవలెనని దేవుడు కోరెను. అందువలననే తోటలు జీవవృక్షమును మొలిపించి, అతడు సంపూర్ణముగా అనుభవించి ఆనందించ గలుగుటకు మానవునికి ఏలుబడిని, అధికారమును, శక్తిని దేవుడు అనుగ్రహించెను.

దేవుడు తన ప్రేమను కనుపరచుటకు మానవుని కలుగజేసెను. మానవుని యెడల ఆయన ప్రేమ బహు గొప్పది. ఆయన ప్రేమ నిత్యముండునది. "శాశ్వతమైన ప్రేమతో నేను నిన్ను ప్రేమించుచున్నాను" అని యిర్మీయా 31:3లో ఆయన ప్రకటించెను. అదే తలంపు ఎఫెసీ. 3:18, 19లో మరల చెప్పబడినది. ప్రభువైన యేసుక్రీస్తే ఆ జీవవృక్షము. ఆ మొదటి మానవుడు జీవవృక్ష ఫలములను తిని యుండిన యెడల ప్రభువైన యేసుక్రీస్తు యొక్క జీవముతో అతడు నింపబడి, తనచుట్టునున్న సమస్తమును అనుభవించగలిగెడివాడు. కాని అవిధేయత వలన ఆదాము

ఆ అధిక్యతను కోల్పోయెను. అవిధేయత ద్వారా ఆదాము కోల్పోయినది ఇప్పుడు ప్రభువైన యేసుక్రీస్తు యొక్క విధేయత ద్వారా తిరిగి సమకూర్చబడుచున్నది.

ఆయన శక్తితో మనము సంపూర్ణముగా నిలబడవలెనని దేవుడు కోరుచున్నాడు. ఆ శక్తితోనే శోధనలను, పరీక్షలను, కష్టములను జయించ గలము. ఒక దినమున అదే శక్తిద్వారా అమర్త్య దేహములను పొందెదము (రోమా 8:11). అది పునరుత్థాన శక్తి. యేసుక్రీస్తు ప్రభువును మృతులలో నుండి లేపుటలో దేవుడు ఆ శక్తిని బయలు పరచెను. భూమిపై అనుదినము శోధనలు జయించుటకు, భారములు భరించుటకు ఆ శక్తి ద్వారానే ఉజ్జీవింపబడుచున్నాము, ఆ శక్తి ద్వారానే పరలోకములో అమర్త్య దేహములు మనకనుగ్రహింపబడును. అంతమున దేవుని సంపూర్ణతలో ఆ శక్తి ద్వారానే మన భాగమును అనుభవించెదము. ఆ పునరుత్థాన శక్తి ద్వారానే మన అంతరంగ పురుషుడు బలపరచబడి, ప్రభువైన యేసుక్రీస్తు నందు లోతుగా వేరుపారిన జీవితమును కలిగి యుండగలము (ఎఫెసీ. 3:16, 17).

పర్వతములపై ఎత్తైన చెట్లను చూడగలము. ఎంత పెద్ద తుఫాను వచ్చినను ఆ వృక్షములు పడిపోవు. ఎందుకనగా వాటి వేరులు భూమిలోనికి లోతుగా పోయి విశాలముగా ప్రాకియుండును. ఎట్టి తుఫానైనను వాటిని పెకలించలేదు. అవి ఎంతో ఎత్తుగా పెరుగుచుండును. వాటి వేరులు లోతునకు పోవుచుండును. అదే రీతిగా అంతరంగ పురుషునితో పరిశుద్ధాత్మ ద్వారా ప్రభువైన యేసుక్రీస్తునందు మనము లోతుగా వేరు పారి జీవించ గలము. ఎట్టి శ్రమయైనను, పరీక్షయైనను, కష్టమైనను మనలను కదల్చ లేదు. శ్రమలలో ఆనందించగలము. అదే సమయములో ఆత్మీయముగా బలపడుదుము. ఆత్మీయముగా మనము ఎదుగు కొలది అంతమున

దేవుని సంపూర్ణతతో నింపబడుదుమని ఎరుగుదుము. అధిక పరిమితిలో దేవుని ప్రేమ మనలను నింపుచుండుటను గమనించగలము. దాని ఫలితముగా మృదుత్వము, సహనము, దయ మొదలగు సుగుణములు గలవారమగుదుము. శత్రువులను ప్రేమించగలము. ప్రేమకు పాత్రులు కానివారిని సహితము ప్రేమించగలము. మనలను దూషించి, శపించు వారికొరకు ప్రార్థించగలము. అదియే మనము ప్రభువైన యేసుక్రీస్తు నందు లోతుగా వేరుపారిన జీవితము కలిగియున్నామని ఋజువు చేయును. ఒక దినమున ఆయన సంపూర్ణతతో నింపబడుదు మనునదియే మన నిరీక్షణ. ఆ రహస్యమును అధిక పరిమాణములో నేర్చుకొనుటకు ప్రభువు మనకు సహాయము చేయునుగాక!

అంతమున మనము దేవుని సంపూర్ణతతో నింపబడవలెనను ఉద్దేశము కలిగి ప్రేమ కలిగిన దేవుడు మనలను వెదకి కనుగొనెను. ఈ కార్యము భూమిపై నారంభమై మనము నింపబడు పర్యంతము కొనసాగును. దేవుడనుగ్రహించు సమస్తమును సమృద్ధిగా ననుగ్రహించును. ఈ సత్యమే దేవుని సంపూర్ణతను ఋజువు చేయుచున్నది (యోహాను 10:10). దేవుడు తన మట్టుకు తాను జీవమును సమృద్ధిగా ఆరంభము నుండి అనుగ్రహించు చుండెను. సమృద్ధియైన జీవము ననుభవించుటకు మనకు అనేక సంవత్సరములు పట్టవచ్చును. కాని అది దేవుని యేర్పాటు కాదు. ఆరంభమునందే దానిని దేవుడు మనకనుగ్రహించుచుండెను. ఎందుకనగా "వాటికి జీవము కలుగుటకును" అది సమృద్ధిగా కలుగుటకును నేను వచ్చియున్నాను" అని చదువుచున్నాము. ఆయనను సంపూర్ణముగా నమ్మి లోబడనందువలన అనేక సంవత్సరముల వరకు అట్టి జీవమును అనుభవింపలేకున్నాము. కాని ప్రేమగల దేవుడు సమృద్ధియైన జీవమును మనకనుగ్రహించుచున్నాడు. అదే రీతిగా సమాధానమును, సత్యమును కూడ సమృద్ధిగా ననుగ్రహించుచున్నాడు

(యిర్మీయా 33:6). జీవమును సమృద్ధిగా అనుగ్రహించుచున్న రీతిగనే, సమాధాన సత్యములను గూడ సమృద్ధిగా ఆరంభమునుండే అనుగ్రహించు చున్నాడు. మనము కొనసాగి పోవునప్పుడు దేవుడు మనకనుగ్రహించ గోరునది అనుభవములో కనుగొందుము. సంపూర్ణముగా దేవునికి లోబడి, చిన్న విషయములలో కూడ ఆయన చిత్తమును నెరవేర్చుటకు మనమారంభించినప్పుడు దేవుని సమాధానము మన హృదయములలో అధికమగుచుండును.

యోహాను 15:11, 16:24లో దేవుడు పరిపూర్ణ సంతోషమును అనుగ్రహించు చున్నాడు. కాని తక్కువ పరిమితిలో కాదు. శ్రమలలో సంతోషించుటకు మనము నేర్చుకొనిన యెడల మన సంతోషము పరిపూర్ణము కాదు. శిష్యులు హింసించబడినప్పుడు సంతోషించిరని అపో. కార్య. 5:41లో చదువుచున్నాము. అటుపిమ్మట కూడ ఎదిరింపు, హింస వచ్చిన తరువాత సంతోషముతో, పరిశుద్ధాత్మతో వారు నింపబడిరి (అపో. కార్య 13:52). ఆయన నిమిత్తము శ్రమపడు ఆధిక్యతను బట్టి దేవుని స్తుతించ నేర్చుకొనునప్పుడు మన కృతజ్ఞతయొక్క పరిమాణములో మన ఆనందము కూడ హెచ్చుగుచుండును. దేవుని సన్నిధిలో మనము జీవించునప్పుడు మన సంతోషము పరిపూర్ణమగుట గుర్తించగలము (కీర్త. 16:11). గనుక దేవుని సన్నిధిలో కనిపెట్టి యుండి, దేవుని వాక్యము చదువుటలోను, ధ్యానించుటలోను, ఆరాధించుటలోను, ప్రార్థించుటలోను సమయము గడుపవలెను. అప్పుడు మన సంతోషము పరిపూర్ణమగును.

మనము ఆత్మలో ఎడతెగక నిండి పొర్లుచు నుండవలెనని ప్రభువు కోరుచున్నాడు. అందువలననే, "మీరు అవివేకులు కాక ప్రభువు యొక్క చిత్తమేమిటో గ్రహించుకొనుడి" అని యనుచున్నాడు (ఎఫెసీ. 5:17, 18). అల్ప విషయములకు కూడ దేవుని చిత్తమును కనుగొనుటకు మనము

నేర్చుకొనినప్పుడే పరిశుద్ధాత్మతో నింపబడగలము. వేరే రీతిగా ఇది సాధ్యము కాదు. ప్రతి విషయములోను దేవుని చిత్తమును కనుగొనుటకు, "ప్రభువా నా చిత్తము కాదు, నీ చిత్తమే నెరవేరునుగాక" అని చెప్పవలెను. స్వయమునకు, స్వచిత్తమునకు ఎంత ఎక్కువగా చనిపోవుదుమో అంత ఎక్కువగా ఆత్మతో నింపబడుదుము.

సమాధాన, సంతోష, జీవములను సమృద్ధిగా అనుగ్రహించు చున్నట్టుగానే "నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది" అని ప్రభువు సెలవిచ్చుచున్నాడు (మత్తయి 28:18). ఆ అధికారమును మనము ఉపయోగించవలెనని ఆయన కోరుచున్నాడు. ఆయనకు లోబడి, ఆయనను వెంబడించి, సేవించుచుండిన యెడల ఆ అధికారము మనకనుగ్రహించబడును. "పరలోకమందును, భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నదని వెళ్లి సమస్త జనులకు తెలియజేయుడి" అనెడి వర్తమానముతో ప్రభువు తన శిష్యులను పంపెను. ఆయనను విశ్వసించిన వారు అనుదినము అట్టి అధికారమును అనుభవించిరి. ఆయనకు విధేయులై ఆయనను వెంబడించు చుండగా వారు అట్టి అధికారమును పొందిరి (1 కొరింథీ. 1:18).

ప్రభువు తన సంపూర్ణతను తక్కువ పరిమాణములో గాక సమృద్ధిగా ననుగ్రహించుచున్నాడు. ఆయన సమృద్ధిగల దేవుడు. సమస్తమును మనకు సమృద్ధిగా నియ్యగోరుచున్నాడు. మనము ఆయన యొద్దనుండి ఏమి పొందినను, జీవమైనను, సమాధానమైనను, సంతోషమైనను, సత్యమైనను లేక శక్తినైనను సమృద్ధిగా ననుగ్రహించుచున్నాడు. పరిశుద్ధాత్మయొక్క సంపూర్ణత ఇహలోకములోని సమస్తము నూతన సృష్టికి చెందినవి కూడ విశ్వాసము ద్వారానే మనకనుగ్రహింపబడుచున్నవి. "సమస్తమును మీవే" అని చెప్పబడి యున్నది. నూతన సృష్టిలోని సమస్తము మీవేయనుచున్నాడు.

కాని పాత సృష్టిలోనిది కాదు (ప్రకటన 21:7). మనము సందేహములను, భయములను, అవిశ్వాసమును జయించి, నూతన సృష్టిలోని సమస్తమును యెడతెగక కోరుకొనుచుండవలయును. దాని నిమిత్తము దైవజ్ఞానమవసరమై యున్నది. దైవజ్ఞానము నమృద్ధిగా మనకందుబాటులో నున్నది. అందువలననే అపొస్తలుడైన పౌలు ఎఫెసీ. 1:16, 17లో ఇట్లు ప్రార్థించెను: "మన ప్రభువైన యేసుక్రీస్తుయొక్క దేవుడైన మహిమ స్వరూపియగు తండ్రి, తన్ను తెలిసికొనుటయందు మీకు జ్ఞానమును, ప్రత్యక్షతయును గల మనస్సు అనుగ్రహించునట్లు". పౌలు, అపొల్లో, తిమోతి, యోహాను మొదలగు అపొస్తలులు, గొప్ప దైవజనులు ఎఫెసీయులకు బోధించు నిమిత్తము పంపించబడినందున రక్షణ సిద్ధాంతములలో ఎఫెసీయులు అధిక ఉపదేశమును పొందియుండిరి. అయినను దేవుడు వారి నిమిత్తము ఉద్దేశించి ఏర్పాటు చేసిన సమస్తమును వారు అనుభవించగలుగునట్లు ఇంకను అధిక జ్ఞాన వివేకములను వారి కనుగ్రహించవలయునని పౌలు ఎఫెసీయుల కొరకు ప్రార్థించెను. పైనుండి వచ్చు అదైవిక పరలోక జ్ఞానము మనకందరికి కావలయును. ఆ జ్ఞానముతో దేవుని సంగతులు గ్రహించ గలము. విశ్వాసము ద్వారా అట్టి జ్ఞానమును పొందగలము. ఆయన సంపూర్ణతతో మనము నింపబడునట్లు అట్టి జ్ఞానమును మనము గలిగి యుండవలెనని ప్రభువు కోరుచున్నాడు. గతకాలములో పతనములు, కొరతలు, బలహీనతలుండినను, ప్రశస్త రక్తముతో కొనబడి, దేవుని సంపాద్యమైన పిదప ఆయన విశ్వాసుల కనుగ్రహించు ప్రతి అధికృతను మనము కోరుకొనవచ్చును. దేవుని సేవించుచున్న అపొస్తలుడైన పౌలును పోలిన కొద్దిమంది ఏర్పాటు చేయబడిన విశ్వాసులకు మాత్రమే గాక ఎఫెసీ. 1:3 లోని వాగ్దానము ప్రతి విశ్వాసి నిమిత్తము ఇయ్యబడినది. ఇట్టి సమస్త ఆత్మీయ ఆశీర్వాదమును పరలోక స్థలములో ప్రభువైన యేసుక్రీస్తు నందు ప్రతి విశ్వాసియు పొందవలెనని మన ప్రేమగల దేవుడు

కోరుచున్నాడు. మన హక్కును కోరుకొని మన భాగమును పొందవలెను. దానికి మనము అర్హులము కాము. ప్రేమగల దేవుడు తన ప్రేమను మనకు బయలుపరచుటకు ఇట్టి ఈవులను అనుగ్రహించుచున్నాడు.

ఎఫెసీ. 3:19లో మొట్టమొదటిగా వారు దేవుని ప్రేమను ఎరుగ వలెనని వారికొరకు ప్రార్థించుచున్నాడు. వ్యక్తిగతముగా దానిని మనము గ్రహించలేము. దేవుని వాక్యమును ధ్యానించుచు శతాబ్దములు గడిపినను, అమర్మములను మనంతట మనము గ్రహించలేము. పురాతన దినములలో ఏకాంతముగా జీవించుటద్వారా అధిక పరిశుద్ధులమగుదుమని రోమన్ కథోలిక్ సన్యాసులు తలంచిరి. అందువలననే పాలస్తీనాలోని అనేక సన్యాసుల మఠములను (Merastries) చూడగలము. ప్రతి కొండమీద మఠములుండుట నేనుకూడ చూచితిని. ఎవరిని చూడకుండ ఏకాంత స్థలములో జీవించుచు, దేవుని వాక్యమును ధ్యానించి, సన్యాసులు అధిక పరిశుద్ధత పొందవలెనను ఉద్దేశముతో అనేక శతాబ్దముల క్రితము ఈ మఠములు నిర్మింపబడినవి. అట్లు చేయుటలో వారిని బాగు చేయుటకు బదులు వారిని చెడిపివేసిన అనేక పద్ధతులు, ఆచారములు వాడుక లోనికి వచ్చినవి.

ఇచ్చట ఒక రహస్యమున్నది. ఎఫెసీ 3:17-19లో నున్న ప్రకారము దేవుని ప్రేమ పరిశుద్ధుల సహాయముతోనే గ్రహించగలము. అయన ప్రేమ మానవ గ్రహింపునకు మించినది. మనమందరము పలుమార్లు చేరి రావలయును. సహవిశ్వాసులముగా మన సహవాసము చాల ప్రోత్సాహ కరముగాను, సహాయకరముగా నుండుట కనుగొన గలము. అవిశ్వాసులకు అట్టి సహవాసము లేదు. నిత్యజీవ అనుభవమును పొందిన వారు మాత్రమే అట్టి సహవాసమును కలిగి యుండగలరు (1 యోహాను 1:3). గనుక మన సహవాసమంతయు ప్రభువైన యేసుక్రీస్తుతోను, తండ్రియైన

దేవునితోను ఆరంభమగుచున్నది. మన స్వంత ధ్యానములో ప్రభువుయొద్ద కనిపెట్టి యుండినప్పుడు పొందినదెల్లను, మనమందరము చేరి పంచుకొన వలయును. లేనియెడల మనము ఆత్మీయముగా ఎదుగలేము.

"వీరు అపొస్తలుల బోధయందును, .. సహవాసమందును, రొట్టె విరచుటయందును, ప్రార్థన చేయుటయందును ఎడతెగక యుండిరి' యని అపొ. కార్య. 2:42లో చదువుచున్నాము. ఇవి దేవుడు మన ఎదుగుదల కొరకు ఏర్పాటు చేసిన నాలుగు లంగరులు. ఓడ నీటిలోపల నున్న రాళ్లకు ఢీకొని అపాయములో నున్నట్లు అపొ. కార్య. 27:27-30లో చదువుచున్నాము. నావికులు నాలుగు లంగరులు వేసిరి. నీటిలో నున్న రాళ్లకు ఢీకొనుట, తరంగముల అపాయము, ఈ రెండు అపాయముల నుండి తప్పించుకొనుటకు ముందు భాగములో రెండు, వెనుక భాగములో రెండు లంగరులను వేసిరి. నాలుగు లంగరుల వలన ఓడ నిలకడగా నుండి రాళ్ల నుండి కాపాడబడినది. మన క్రైస్తవ జీవితము ఆ ఓడవలె నున్నది. మనము అనేక జీవిత తుఫానులను ఎదుర్కొనవలసి యున్నది ఈ తుఫానులను, ప్రమాదములను దేవుని సహాయముతో ఈ నాలుగు లంగరుల ద్వారా జయించగలము (అపొ. కార్య. 2:42 43). అందువలననే ఆది క్రైస్తవులు - అపొస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టె విరచుట యందును, ప్రార్థన చేయుట యందును ఎడతెగక యుండిరి.

సర్వలోకములో నున్న సహవిశ్వాసులతో సహవాసము కలిగి యుండుటకు మనము నేర్చుకొనునప్పుడే దేవుని ప్రేమను యదార్థమైన రీతిగా గ్రహించగలుగుదుము. ప్రార్థన, ఆరాధన, బైబిలు పఠనము పరిచర్యల కొరకు దేవుని ప్రజలను సమకూర్చుటకు నీవు కొంత త్యాగము చేయవలయును. అట్టి సహవాసము ద్వారా క్రీస్తు ప్రేమను పరిపూర్ణ జ్ఞానముతో ఎరుగగలము. అట్టి ప్రేమద్వారా ఆయన సంపూర్ణతలో మనము ఎందుకొరకు పాలుపొందవలెనని కోరుచున్నాడో మనకు తెలియజేయు

బడును. ఆయన ప్రేమ ఎంతో గొప్పది. గనుక తనకు కలిగిన సమస్తమును మనము పొందవలెనని కోరుచున్నాడు. ప్రేమ గలిగిన తల్లిదండ్రులు తమకు కలిగిన సమస్తమును తమ బిడ్డలకియ్య గోరునట్లు ప్రభువు తనకున్న సమస్తమును మనకియ్య గోరుచున్నాడు. దేవుని సంపూర్ణతను పరలోకములో అనుభవించు ఆధిక్యత నిమిత్తము మనమెట్లు భూమిపై సిద్ధపడవలెనో మనకిప్పుడు నేర్పించబడుచున్నది.

పూర్వకాలమందు నిర్గమ కాండము 28:1, 2, 4లోని ప్రధాన యాజకుని ప్రతిష్ఠిత ద్వారా ఆ సత్యము స్పష్టీకరించబడినది. ఆ గొప్ప పరిచర్య నిమిత్తము అహరోను, అతని కుమారులు ప్రత్యేకింపబడిన వివరములు లేవీయ కాండము 8వ అధ్యాయములో నున్నవి. పాత నిబంధనలో సంభవించినవెల్లను ఇప్పుడు క్రొత్త నిబంధన కాలములో సంభవించుచున్న వాటియొక్క ఛాయయై యున్నవి (హెబ్రీ. 8:5). ప్రభువైన యేసుక్రీస్తు మన నిజమైన శాశ్వతకాలపు ప్రధాన యాజకుడు (హెబ్రీ. 7:24, 26). అంతమున మనలను నిర్దోషులనుగా, నిందా రహితులుగా ఆయన సంపూర్ణతతో సి. పబడినవారుగా నిలువ బెట్టుటకై ప్రభువైన యేసుక్రీస్తు మన ప్రధాన యాజకుడుగా యెడతెగక విజ్ఞాపన చేయుచున్నాడు (యూదా 24). మనకొరకు విజ్ఞాపన చేయుటకాయన ఇష్టపడుచున్నందున సంపూర్ణముగా మనలను రక్షించుటకు సమర్థుడు. దూతల యెదుటను, పరిశుద్ధుల యెదటను నిర్దోషులనుగా, నిందా రహితులనుగా నిలువబెట్టవలెనని కోరుచున్నాడు. ఆయన మహిమలో, సంపూర్ణతలో మనలను పాలి భాగస్థులనుగా చేయవలెనని కోరుచున్నాడు (1 పేతురు 5:1)

... ::: ::: ::: ...

# 2
# ప్రతిష్ఠిత వస్త్రములు

దేవుడు మనతో పంచుకొన గోరుచున్న తన మహిమా సౌందర్యములను, దేవుడు ప్రధాన యాజకుని కొరకు తయారుచేసిన వస్త్రములు చూపించుచున్నవి. అందువలననే పాత నిబంధనలో ప్రధాన యాజకుని వస్త్రములు మహిమాలంకార వస్త్రములని పిలువబడెను. ఒక పక్షమున అతి పరిశుద్ధ స్థలములో ప్రవేశించుట కెవరును అర్హులు కారని దేవుడు చూపించు చుండెను. అందరు పాపము చేసిరి గనుక ఆ స్థలమున కెవరును పోజాలరు. ప్రాయశ్చిత్తము చేయుటకై ప్రధాన యాజకుడు మాత్రమే సంవత్సరమున కొకమారు తెర వెనుకకు వెళ్లుటకు అధికృత కలిగి యుండెను. మరొక పక్షమున మనము పాపముచేత సంపూర్ణముగా పాడుచేయబడి, అపొస్తలుడైన పౌలు వలె "నాయందు అనగా నా శరీరమందు మంచిది ఏదియు నివసించదని నేనెరుగుదును" (రోమా 7:18) అని పలుకవలసి యుండినను దేవుడు ప్రధాన యాజకుని మహిమాలంకార వస్త్రముల ద్వారా మనము కూడా మహిమా యుక్తముగా, సౌందర్య వంతముగా మారవలెనని ఆయన కోరుచున్నట్లు తెలియజేయు చున్నాడు. వాస్తవముగా మనమెవ్వరమును అతి పరిశుద్ధ స్థలములో దేవుని సన్నిధి యనుభవించుటకు అర్హులము కాము. కాని సంవత్సరములో ఒక దినమున ప్రధాన యాజకుడు దేవునితో సహవాసము కలిగి యుండవచ్చును. ఈ వస్త్రముల ద్వారా మన ప్రేమ, ఆనందము ఎట్లు సంపూర్ణమ్ము కాగలవో, పాపము వలన వచ్చిన దిగంబరత్వము ఎట్లు

పూర్తిగా కప్పబడగలదో, దేవుని సన్నిధిలో మనమెట్లు మహిమా పూర్ణులముగా కాగలమో దేవుడు చూపించుచుండెను.

ప్రధాన యాజకుడు ప్రత్యక్ష గుడారములో అటు నిటు సంచరించుట చూచిన వారితో దేవుడిట్లు మాట్లాడుచుండెను - "నన్ను విడిచి దూరముగా పోయిన ప్రజలారా, మీరు నా చెంతనుండి, నా సంపూర్ణ తను అనుభవించవలెనని కోరుచున్నాను". పాప క్షమాపణ నొంది, పర లోకములో నొక మూలను సంపాదించుకొనుటతో తృప్తి చెందక, దేవుని సంపూర్ణతలో మన భాగమును పూర్తిగా అనుభవించు రహస్యమును మనము నేర్చుకొనవలెను. విశ్వాసముతో దానిని మనము నేర్చుకొనవలెను. ప్రభువైన యేసుక్రీస్తు నాయొక్క మహిమాలంకార వస్త్రము (ఎఫెసీ 3:16). ఆయనయందు ఈ ఏడు వస్త్రములను చూడగలము. ఆ రీతిగా అధికముగా ఆయన సంపూర్ణతతో నింపబడగలము.

## ప్రధాన యాజకుని సిద్ధపాటు

ప్రభువు పరిచర్య నెరవేర్చుటకు ప్రధాన యాజకుడు ధరింపవలసిన వస్త్రములను మోషే చేతపట్టుకొని మొదట అహరోను నొద్దకు వెళ్లెనని లేవీయ కాండము 8వ అధ్యాయములో చదువుచున్నాము. అప్పుడు అహరోను, అతని కుమారులు శారీరకముగా సమాజము ఎదుట నీటితో కడుగబడిరి (లేవి కాం. 8:6). వారు మురికిగా నున్నందున సమాజము యెదుట కడుగబడలేదు గాని ఒక ఉద్దేశముతోనే వారట్లు కడుగబడిరి. బైబిలులో నీరు దేవుని వాక్యమును సూచించుచున్నది (ఎఫెసీ. 5:27). సర్వజనాంగము నిమిత్తము దేవుని సేవ చేయుటకు వారు ప్రత్యేకింపబడి నందున, వారు సర్వజనుల సమక్షములో కడుగబడుచుండగా అహరోను సమస్తమునకు దేవుని వాక్యబద్ధుడై యుండవలెనని ఎల్లరికి సూచింప బడుచుండెను. ఎట్టి మానవ కల్పితమైన పద్ధతి గాని, ఆచారమును గాని

పాటింపక కేవలము దేవుని వాక్యమునే సతతము అనుసరింపవలెను. అనేకులు దేవుని వాక్యానుసారముగా నడచుటకు బదులు మానవ పద్ధతులను, ఆచారములను, అలవాట్లను అనుసరించి నడుచుచుందురు అందువలననే వారు ఆత్మీయముగా ఎదుగుట లేదు. ప్రతి దేశములో ఇట్లే జరుగుచున్నది. బిడ్డల జన్మ సమయములలో, వివాహ సమయములలో లేక భూస్థాపన సమయములలో దేవుని వాక్యమునకు బదులు వారు మానవ వాడుకల ప్రకారము చేయుచుందురు. దేవుని వాక్యమునకంటె మానవ అలవాట్లకు వారు అధికముగా బద్ధులై యుందురు.

మన సమస్త అక్కరల కొరకు, సమస్యల కొరకు, కార్యకలాపముల కొరకు దేవుని వాక్యములో సూచనలు యివ్వబడినవి. దేవుని వాక్యమును సంపూర్ణముగా ఘనపరచని యెడల దేవుని సంపూర్ణతలో పూర్తి భాగమును పొందు హక్కు మనకుండదు. దేవుని వాక్యమును అలక్ష్యము చేయుట ద్వారా దేవుని సంపూర్ణతలోని భాగమును కోల్పోవుదుము. మనము దృఢమైన తీర్మానము చేసికొని, దేవునికిట్లు వాగ్దానము చేయవలెను - "ప్రభువా, నా సమస్త పనిపాటలలో, మార్గములలో, ఏర్పాట్లలో నీ వాక్యమునకు సంపూర్ణముగా లోబడెదను". అట్టి దర్శనము తోడనే నలువది సంవత్సరముల క్రితము మద్రాసులో తన పరిచర్య లోనికి ప్రభువు మమ్ములను నడిపించెను. ప్రతిచోట విశ్వాసులు మానవ పద్ధతులకు, అలవాట్లకు బానిసలై యుండుట చూచితిమి. మానవ అలవాట్లకు లోనుకానివారు ప్రభువులో బాగుగా నెదుగుచుండుట గమనించితిమి. కాని అలవాట్లకు బానిసలైనవారు ఆత్మీయ అంధత్వములో నుండిరి దేవుని వాక్యమును వారు సంపూర్ణముగా అనుభవించి ఆనందించలేరు. తమ జీవితముల విషయమై దేవుని ఏర్పాటును, ఉద్దేశమును వారు కనుగొన లేరు. అందువలననే అనేక లక్షల ప్రజల సమాజము యెదుట

మోషే అహరోనును, అతని కుమారులను కడిగెను. అది బహిరంగ ప్రదర్శన కొరకు కాదు గాని మాదిరిగా నుండుటకు అట్లు చేసెను.

ప్రథమముగా అహరోను లోపములేని వ్యక్తిగా నుండవలయును. ఎట్టి లోపమైనను అతనిలో నుండకూడదు. అతని దేహములో ఏ భాగము నందైనను ఎట్టి అల్పదోష ముండినను, ప్రధాన యాజకుని పదవికి అతడు అయోగ్యుడుగా ఎంచబడెడివాడు (లేవి కాం. 21:18). అట్టి లోటులేని వ్యక్తి ప్రపంచములో ఏ భాగమందైనను కనిపించడు. కాళ్లలోనో, చేతులలోనో లేక శరీరములో ఏదోనొక భాగమందు ప్రతివారికి లోటు ఉండితీరును. ఆ గొప్ప జనసమూహము ఎదుట అహరోను తన లోపమును ఎట్లు దాచగలడు? సామాన్యమైన మానవునివలె అతడు లోపము కలిగియుండును. కాని దేవుని శక్తిద్వారా అతడు లోపములేని వ్యక్తిగా మారెనని నేను నమ్ముచున్నాను. దేవుడు తన బలమైన హస్తముతో అతనిని ఏర్పరచుకొనినందున అతడు లోటులేని వ్యక్తియాయెను. అదే విధముగా లోటులేని వారముగా నుండుటకు మనమెంత ప్రయత్నించినను సఫలత పొందలేము. ఎప్పుడో నొకప్పుడు, ఏదోనొక స్థలములో, ఏదోనొక పొరపాటు చేసియుండవచ్చును. ఏదోనొక బలహీనత మనలో తప్పక యుండును. మానవ ప్రయత్నముల ద్వారా మనము నీతిమంతులము కాలేము. ప్రభువైన యేసుక్రీస్తే మనయొక్క నీతి, రక్షణ. ఆయనే నన్ను సంపూర్ణునిగా, పరిపూర్ణునిగా చేయును. నాలో నేను పరిపూర్ణునికాదు; కాని కొలస్సై. 2:10 లోనున్న ప్రకారము "ఆయనయందు మీరును సంపూర్ణులై యున్నారు". ఇది చాలా సహాయకరమైన, ప్రాముఖ్యమైన వచనము. ప్రభువైన యేసుక్రీస్తు నాయొక్క సంపూర్ణతను, నీతియునై యున్నాడు. అందువలననే మనము ప్రభువైన యేసుక్రీస్తు నామమున ప్రార్థించుచున్నాము. తెలిసియో, తెలియకయో మనము, "ప్రభువా నాయంతట నేను నీచెంతకు వచ్చుటకు నాకు హక్కులేదు. కాని నీవు

నాకొరకు చేసిన దానినిబట్టి నీయొద్దకు వచ్చుచున్నాను" యని చెప్పుచున్నాము.

సర్వశక్తి గల దేవుడు అహరోనును ఏ లోపములేని పరిపూర్ణునిగా జేసెనని నమ్ముచున్నాను. మోషేను కోరుకొనినట్లుగా దేవుడతనిని కోరుకొనెను. మోషే తనంతట తాను ఆ పనికి పూనుకొనలేదు. వాస్తవమునకు మోషే దేవునితో "ప్రభువా, నీవు నన్నేర్పరచుకొనుటకు నేనేపాటివాడను?" అని పలికెను. అదేవిధముగా దేవుడు అహరోనును ఏర్పరచుకొనెను. ఆ ఏర్పాటు వలన అహరోను ప్రతి లోటునుండి విముక్తుడాయెను. అహరోను దేవుని సేవించవలెననియు, సంపూర్ణముగా తన్నుతాను ప్రతి విషయములో దేవుని వాక్యమునకు లోపరచుకొనవలయు ననియు దేవుడతనికి జ్ఞాపకము చేయుచుండెను. అతడు అనుదినము "ప్రభువా, నీకు అయిష్టమైనదేమైనా నా జీవితములో కలదా? దయచేసి నాకది చూపించుము. దాని సరిచేసికొనుటకు కృప ననుగ్రహించుము. ప్రతి విషయములో, ప్రతి వివరమునకు నీ వాక్యమునకు లోబడవలెనని కోరుచున్నాను" అని చెప్పుట కలవాటు చేసికొనెను. ఆ తరువాతనే లేవీయ కాండము 8:7 ప్రకారము అతనికి వస్త్రము లియ్యబడెను.

# 3
# నిలువుటంగీ – నడికట్టు

మొదటగా సుందరమైన తెల్లని నిలువుటంగీ అహరోనుకు తొడుగ వలెను. దాని వివరములు నిర్గమకాండము 28వ అధ్యాయములో నియ్యబడినవి. అతడు ధరింపవలసిన మొదటి వస్త్రము తెల్లని నిలువు టంగీ. ఇది మనము విశ్వాసముతో నంగీకరించు ప్రభువైన యేసుక్రీస్తు యొక్క నీతిని సూచించుచున్నది (రోమా 1:17, 10:3-10)(11 కొరంథీ. 5:21, :21). విశ్వాసము ద్వారానే మనము నీతిమంతుల మగుచున్నాము. మొదటగా ఇట్లు ఒప్పుకొనుచున్నాము - "ఓ దేవా, నేనేమి చేసినను, నాకేమి యిష్టమున్నను, ఏ శ్రమ పొందినను, ఎక్కడికి వెళ్లినను ఫరవాలేదు. కాని విశ్వాస మూలమున నన్ను నీతిమంతునిగా చేయుము". కన్నీరు, ఉపవానము, ప్రార్థన, శ్రమలు లేక స్వప్రయత్నముల ద్వారా నీతిమంతులము కాలేము. సృష్టికర్త, రక్షకుడైన యేసుక్రీస్తు ప్రభువు మనకు బదులు సిలువలో మరణించెనని హృదయపూర్వకముగా విశ్వసించుట ద్వారా నీతిమంతులము కాగలము. ఆయన ఏ పాపము చేయలేదు. ఏ పాపము నెరుగడు. కాని మన స్థానములో ఆయన మరణించెను. ఇష్టపూర్వకముగా తన్నుతాను రిక్తునిగా చేసికొని మనకు బదులు చనిపోయెను. ఆయనయందలి విశ్వాసము ద్వారానే నీతిమంతుల మగుదుము. కాని మనంతట మనమే లేక ఏదో ఒక విధమైన ప్రయాసము ద్వారా నీతిమంతులము కాలేము. మన దిగంబరత్వమును మనంతట మనమే కప్పుకొనలేమను మొదటి వర్తమానము తెల్లని నిలువుటంగీ ద్వారా అందించబడుచున్నది. బంధుమిత్రాదులు పాపములను తీసివేయలేరు. దానధర్మములు మన పాపములను కప్పలేవు. కాని ప్రభువైన యేసుక్రీస్తు

మన నిమిత్తము మరణించినందున తన జీవము, కృపల ద్వారా మన దిగంబరత్వమును కప్పగలుగును.

దేవుని ఆజ్ఞ ప్రకారముగా వస్త్రములన్నియు దైవజ్ఞానముతో కుట్టబడెను. ఇది తెలివైన దర్జీవారిచేత చేయబడలేదు. ఆ సమస్త వివరములు పర్వతముపై మోషేకు వ్రాతమూలముగా నియ్యబడినవి. దేవుడు యోచించిన విధముగా చేయుటకు జనులను తన జ్ఞానముతో నింపెనని చదువుచున్నాము (నిర్గ. కాం. 28:3) అది భూసంబంధమైన జ్ఞానము కాదు; అది పరలోక జ్ఞానము మరియు ఆయన సంపూర్ణత యొక్క స్వచ్ఛమైన జ్ఞానము. ఈ వస్త్రముయొక్కయు, యితర వస్త్రముల యొక్కయు ప్రతి వివరమును దేవుడే ఇచ్చెను. కేవలము పరిశుద్ధాత్మని ద్వారానే రక్షణ మార్గమును గ్రహించగలము (1 కొరింథీ. 2:14). విశ్వాసులముగా మనము పరిశుద్ధాత్మునియందు నిలిచియుండని యెడల మన బోధలు వ్యర్థమే. పరిశుద్ధాత్మ అభిషేకము పొందనియెడల మనము చెప్పునది ప్రజలు గ్రహించలేరు.

దేవుని మహిమా సౌందర్యములలో వారెట్లు పాలుపొందగలరో దేవుడు తన ప్రజలకు చూపించుచుండెను. ఆ వస్త్రము లోకఘనత కొరకు కాదు. ఎందుకనగా అట్టి వస్త్రములు ప్రపంచములో ఎక్కడను లేవు. అవి పరలోక వస్త్రములు. ఎవరును, ఎప్పుడును ఇట్టి వస్త్రములు ధరించలేదు. ఆ వస్త్రముల రంగు, పొందికనుబట్టి అవి పరలోకమునుండి వచ్చినవే యని చెప్పవచ్చును. గనుక దేవుని సంపూర్ణతలో పాలుపొందుటకు మొదట నీతియొక్క అర్థమును మనము నేర్చుకొనవలెను. మనలో అనేకులము అతిశయించుదుము. కొన్ని పర్యాయములు హృదయములో ఇట్లనుకొనుచుందుము – "నేను ఫలానివారివలె లేను. నేను అతనివలె బలహీనుడను, బుద్ధిహీనుడను కాను". కాని ఆ తరువాత మనమందరము అనేక బుద్ధిహీన కార్యములు చేయువారమని కనుగొందుము. అనేక తప్పు పనులు

చేయుచుందుము. తరచుగా శోధనలలో పడుచుందుము. మన స్వంత మనోబలముపై, సామర్థ్యముపై నాధారపడిన క్షణమందే పడిపోవు చుందుము. తెలియక సబ్బుముక్కపై అడుగు పెట్టవచ్చును. నీవు జారిపడి కాలు విరుగగొట్టుకొనవచ్చును. నీవట్లు చేయవలెనని కోరక పోయినను నీవు పడిపోయినందున అనేక మాసములు పడకమీద నుండవలసి వచ్చును. కనక తెలిసియో, తెలియకయో, ఇట్టి పనులు చేయుచుందుము. బుద్ధిహీనత వలన ఏదో ఒక మాటందుము. ఆ తరువాత బాధపడుదుము. మనము బలహీనులము, బుద్ధిహీనులమని దేవుడు చూపించుచున్నాడు. విశ్వాసము ద్వారా మనమిట్లనవలెను - "యేసు ప్రభూ! నీవేనా నీతి; నా స్వనీతి, ప్రార్థనలు, పుస్తకములు, వస్త్రములు, నా వ్యక్తిత్వము మొదలగు వాటిపై నేను ఆధారపడుట లేదు". ఆయన మనకు నీతిగా నున్నందులకు ఆయనకు వందనములు చెల్లించవలయును. అనుదినము ఆయన నీతినే మనము అన్వయించు కొనవలయును.

మన ప్రాణము రక్తములో నున్నది. మనలో రక్తము ప్రసరించు చున్నప్పుడు ప్రాణమున్నదని ఎరుగుదుము. గుండె కొట్టుకొనుట ఆగిపోయిన వెంటనే మనుష్యుడు చనిపోవును. అతని శరీరమునుండి దుర్గంధమారంభమగును. గుండె కొట్టుకొనుచున్నంతకాలము శరీరము బలహీనముగా అనేక వారములు, మాసములు జబ్బుగా నుండినను, సరియైన ఆహారము లేకపోయినను, శరీరములో ప్రాణముండును. మనము చనిపోయిన క్షణమునుండి శరీరములో దుర్గంధము బయలుదేరును. అందువలననే మృతదేహమును పాతిపెట్టవలెను లేక కాల్చివేయ వలెను. అదే రీతిగా ఆయనయొక్క జీవము అప్పుడప్పుడు గాక ఎడతెగక మనలో ప్రవహించునట్లు చూచుకొనవలెను (కొలస్స 3:4). నాడిని చూచినప్పుడు మనుష్యులు నడుచుచున్నను, కూర్చుండి యుండినను లేక పరుండి యుండినను వారిలో జీవమున్నదనియు, గుండె కొట్టుకొనుచున్నదనియు, సజీవులుగా నున్నారనియు యెరుగుదుము. జీవమును గుర్తించవచ్చును.

ప్రభువైన యేసుక్రీస్తుయొక్క ప్రేమ యెడతెగక, ధారాళముగా మనలో ప్రవహించుచు, మనలను సజీవులుగా నుంచును. గర్వమో, ద్వేషమో లేక ఇతర పాపమేదైనను ప్రవాహమును ఆపివేయగలదు లేక ప్రవాహమును తక్కువ చేయగలదు.

కొన్ని గృహములలో నీటి కొళాయిలుండును. కొన్ని పర్యాయములు నీరు ధారాళముగా ప్రవహించక కొన్ని బొట్లు మాత్రమే పడుచుండును. అదే సమయంలో వేరే గృహములలో పూర్తి ప్రవాహముండవచ్చును. నీటి గొట్టములను తెరచిన యెడల ఎంతో చెత్త, మురికి పేరుకొని యుండుట కనబడవచ్చును. ఆ చెత్తను తీసివేసినప్పుడు మరల ధారాళముగా ప్రవాహము వచ్చును. నీలో జీవమెట్లు ప్రవహించుచున్నది? బొట్లువలె-నున్నదా? లేక ధారాళమైన పూర్తి ప్రవాహమున్నదా? మనము సమృద్ధియైన జీవము కలిగి యుండవలెనని దేవుడు కోరుచున్నాడు. ఆయన ప్రతిదానిని సమృద్ధిగా ఇయ్యవలెనని కోరుచున్నాడు. సమృద్ధియైన జీవము సమృద్ధియైన సమాధానము, సమృద్ధియైన శక్తి నొసగి ఫలించెడి వారినిగా చేయవలెనని దేవుడు కోరుచున్నాడు. ఆ ప్రవాహము, సమాధానము ఆనందము, శక్తి తగ్గిపోవుచున్నదని మనము గుర్తించిన యెడల హృదయములను పరిశీలించుకొనవలెను. మనలను మనము పరీక్షించుకొని, తగ్గించుకొనిన వారమై "ప్రభువా, ఎందువలన నా సమాధానము తగ్గి పోయెను. బలమైన రీతిగా నీ సన్నిధిని నేనెందువలన గుర్తించలేక పోవుచున్నాను? నా శోధనలను జయించుటకు మునపటి శక్తిలేదు. దేవుని వాక్యము యెడల మునుపటి ఆకలిలేదు. ప్రార్థనాభారము కూడలేదు" అని అడుగవలెను. ఎచ్చటనో ఏదో అడ్డుపడినది. అది తీసివేయబడవలెను. అప్పుడిట్లు దృఢముగా చెప్పగలము "యేసు ప్రభువా, నీవు నా నీతియై యున్నావు గనుక నిన్ను హత్తుకొనుచున్నాను". నీ మనోబలముపై నాధార పడవద్దు. ఆయన జీవమును అన్వయించుకొనుచుండుము. ఎచ్చటికైనా వెళ్లకమునుపు ఇట్లని చెప్పుము "ప్రభువా ఇప్పుడు నన్ను నీకప్పగించు

కొనుచున్నాను". సాధారణముగా దీర్ఘ ప్రయాణమునకు ముందు అలాగు చేయుదుము. "ప్రభువా, మేము పరిశుద్ధ సమాజ కూటములకు పోవుచున్నాము. దయచేసి ఘాతో ఉండి మమ్ముల నాయత్తపరచుము" చిన్నచిన్న ప్రయాణముల కొరకు ప్రార్థించము. ప్రయాణము తరువాతనైనా ప్రార్థించము. అది మన స్వభావము. పెద్ద విషయముల కొరకు మాత్రమే ప్రార్థన చేయుదుము. ఆ రీతిగా మనము అపవాదిచేత మోసగింప బడుదుము. మనము అజాగ్రత్త పరులమై, నిర్లక్ష్య పరులమై, సమాధాన సంతోషములను కోల్పోవుదుము. ప్రభువైన యేసుక్రీస్తు యొక్క జీవమును అనుదినము అన్వయించుకొనుట ద్వారానే సంపూర్ణతను పొందగలము.

సిలువుటంగీని దట్టీతో కట్టవలయునని లేవీయ కాండము 8:7లో చదువుచున్నాము. అంగీ చాల పొడుపుగా, వదులుగా నున్నందున, దానిని సరిగా నుంచుటకు దట్టీని కట్టవలెను. నడికట్టు విశ్వాసమును సూచించు చున్నది. అనుదినము ప్రభువైన యేసుక్రీస్తుయొక్క నీతిని కోరుకొనుచుండ వలయునని, ఆయనను సేవించుటలో మన శక్తిసామర్థ్యములపై నాధార పడకూడదనియు జ్ఞాపకము చేయుచున్నది. ఎల్లప్పుడు ఆయన శక్తిపై నాధారపడి విశ్వాసముతో ఆయన జీవమును పొందవలెను. సామాన్యముగా ఇట్లు చేయుటకు మరచిపోవుచుందుము. అందువలన సరియైన రీతిగా ఆయనను సేవించుటలో తరచుగా తప్పిపోవుచుందుము. చివరకు మన ప్రయాస వ్యర్థమయినట్లుగా కనుగొందుము. మనము ఆయనను విశ్వసించుటకు నేర్చుకొనక మునుపు అట్టి పతనము లనేకములు సంభవింపవలసి యుండును. కనుక ఆయనను సేవించుటకు కావలసిన శక్తి ఆయనయందు విశ్వాసముంచుట ద్వారానే కలుగును. గాని మన తలాంతులు లేక మన జ్ఞానముద్వారా కలుగదు.

# 4
# నీలి వస్త్రము

నిలువుటంగీమీద నీలి వస్త్రమును, ఏఫోదును ప్రధాన యాజకుడు ధరింపవలెను. నీలి వస్త్రము, ఏఫోదు మరొక ప్రాముఖ్యమైన పాఠమును బోధించుచున్నవి. మత్తయి 5:13-15లో ప్రభువు మనలను ఉప్పునకు, వెలుగునకు పోల్చెను. నీలివస్త్రము, ఏఫోదులో ఈ రెండంతల తలంపు యున్నది. సహ విశ్వాసులకు మనము ఉప్పువంటి వారముగా నుండవలెను. విశ్వాసులముగా ఆరాధనకు ప్రార్థనకు కూడినప్పుడు ప్రభువు సన్నిధిని అనుభవించుటకు ఒకరికొకరము సహాయపడుదుము. అట్టి సందర్భములో విశ్వాసులు మాత్రమే మనతో పాలుపొందగలరు. ఆ రీతిగా ఉప్పువలె ఒకరికొకరము ఉపయోగకరముగా నుందుము.

అవిశ్వాసులకు మనము వెలుగువలె నుండవలయును. క్రైస్తవులముగా మనము గడిపే జీవితము వారికి గొప్ప సహాయముగా నుండును. మనలోనున్న క్రీస్తు ప్రభువు యొక్క జీవము ద్వారా వారు దీవించబడుదురు. మన సాక్ష్యము ద్వారా పురికొల్పబడుదురు. ఆ రీతిగా నీలివస్త్రము, ఏఫోదు విశ్వాసుల యెడలను, అవిశ్వాసుల యెడలను మనకు గల రెండంతల బాధ్యతను సూచించుచున్నవి. అవిశ్వాసులతో పోల్చిన యెడల విశ్వాసులు అల్పసంఖ్యలో నున్నారు. కాని కొద్ది ఉప్పు ఆహారమునకు రుచి కలుగజేయునట్లు లోకములో వారు గుర్తింపదగిన వారుగా నున్నారు. అల్పసంఖ్యలోనున్న విశ్వాసులు భూమిపై దేవుని సంఘముగా నుండి లోకమునకు దేవుని మహిమను బయలుపరచుచున్నారు.

నీలి వస్త్రము ఏఫోదు వస్త్రమని పిలువబడుచున్నది. నీలివస్త్రము

యొక్క పైభాగమునందు పెద్ద రంధ్రమును, క్రింది అంచు చుట్టును బంగారు గంటలు, దానిమ్మ పండ్లు గలవు. దానిమ్మపండ్లు నీలి, ధూమ్ర రక్త వర్ణములలో నున్నవి. దానిమ్మపండ్ల మధ్యలో బంగారు గంటలున్నవి (నిర్గ. కాం. 28:31-35).

యేసుక్రీస్తు ప్రభువుతో జతపని వారముగా మన పరలోక పిలుపును బాధ్యతను నీలివస్త్రము జ్ఞాపకము చేయుచున్నది. మనము దేవుని జతపని వారమై యున్నాము (1 కొరింథీ. 3:9; 2 కొరింథీ 6:1). మనకొక పరలోక పిలుపు గలదు. (హెబ్రీ. 3:1). ప్రతి విశ్వాసికి అందులో భాగము కలదు. అందువలననే ఆ వాక్య భాగములో (1 కొరింథీ. 3:9)లో మనము దేవుని కట్టడమై యున్నామని వ్రాయబడినది. ఒక కట్టడము కొరకు రాళ్లు, ఇటుకలు, మట్టి, కలప మొదలగు సామాగ్రి కావలసి యున్నది. ఒక పెద్ద కట్టడము కొరకు పెద్దరాళ్లు, చిన్నరాళ్లు కూడా కావలయును. ఒక రాతి కట్టడము యొక్క పై భాగమును చూచిన యెడల పెద్ద పెద్ద రాళ్లు కనబడును. కానీ ఆ రాళ్లమధ్యలో చూచిన ఎడల చిన్నరాళ్లకు స్థలముండును. పెద్ద రాళ్లతోనే కట్టడమును నిర్మించలేము. పెద్దరాళ్లు, చిన్నరాళ్లు కూడా కావలయును. అదేరీతిగా మట్టి, కలప, ఇంకా అనేక వస్తువులు కావలసి యుండును. యేసుక్రీస్తు ప్రభువు నందలి ప్రతి విశ్వాసికి దేవుని గృహ నిర్మాణములో భాగము కలదు.

పరలోక పిలుపులో మనము పాలి భాగస్థులము (హెబ్రీ. 3:1). యేసుక్రీస్తు ప్రభువుయొక్క గృహమును కట్టుచున్నాము. మనమే గృహము (హెబ్రీ. 3:6). యేసుక్రీస్తు ప్రభువు యొక్క పరలోకపు నివాస స్థలమును ఆయన శిరస్సత్వము క్రింద నిర్మించుటకు మనకు గల పరలోకపు పిలుపును నీలివస్త్రము సూచించుచున్నది. ఆయన సంపూర్ణతను సంపూర్ణముగా అనుభవించుటకు యేసుక్రీస్తు ప్రభువు యొక్క గృహమును నిర్మించుటలో మనము పాలుపొందవలెను.

నీలివస్త్రపు అంచున నీలి, ధూమ్ర, రక్తవర్ణములు గల దానిమ్మ పండ్లు గలవు. దానిమ్మపండ్లు చూచుటకు పైకి ఒక్కటే పండుగా యుండును కాని కోసి చూచినయెడల దానిలో అనేక అరలుండును. ప్రతి అరలోను రసముతో నిండిన కండకలిగిన విత్తనముండును. ప్రపంచమంతట విశ్వాసులు చెదరియున్నను వారందరు చేరి ఒక సంఘమగుచున్నారు. యేసుక్రీస్తు ప్రభువుయొక్క రక్తము ద్వారా కొనబడిన వారందరు సంఘములోని సభ్యులు. ఒకే ఒక సంఘము కలదు. అసూయలు లేక ఏక మనస్సు గలవారితో యేసుక్రీస్తు ప్రభువు సంఘమును కట్టుచున్నాడు. అట్లుండిన యెడల నీవుకూడా ఆయన సంఘమును కట్టుటలో యేసుక్రీస్తు ప్రభువుతో జతపనివాడవు కాగలవు. అనేక అరలలో నున్న దానిమ్మ విత్తనములు చేర్చబడి ఒక పండుగా నున్నట్లు యేసుక్రీస్తు ప్రభువు యొక్క జీవము ద్వారా మనమొక శరీరముగా నుంచబడు చున్నాము. విశ్వాసుల యొక్క ఏడంతల ఐక్యతయే వారిని ఒక శరీరముగా చేయుచున్నది. ఒక శరీరము, ఒక ఆత్మ, ఒక నిరీక్షణ, ఒక పిలుపు, ఒక విశ్వాసము, ఒక బాప్తిస్మము, ఒకే సృష్టికర్తయైన ప్రభువు. ఇట్టి ఏడంతల ఏకత్వమునే తన ప్రజల మధ్య నుండవలెనని ప్రభువు కోరుచున్నాడు. "నేను పౌలువాడను, నేను అపొల్లోవాడను, నేను కేఫా వాడను" అని అనేకులు ఆరంభములో చెప్ప మొదలిడినందున విభేదములు వచ్చెను ఏ మానవ నామమున సంఘమునకియ్యకూడదు, పెట్టకూడదు. సంఘములని పిలువబడుచున్న వాటికి పెట్టబడిన పేరులు, బిరుదులు భేదములు కలుగజేయును. ఈ దినములలో అట్టి పేరులు 470 కంటే ఎక్కువగా క్రైస్తవులకున్నవి. అట్టి పేరులు విభేదములకు కారణమగును. ఐక్యత ద్వారానే మనము పరలోక సంఘమును కట్టగలము. దానిమ్మ పండ్లు సజీవమైన సంఘమును జ్ఞాపకము చేయుచున్నవి కాని ఏదోనొక కట్టడమును కాదు.

సిలవ్వ్యము యొక్క ప్రతి వివరములో ఆత్మీయ భావము కలదు. ఆ కాలములో దేవుని ప్రజలు దేవునియొక్క సంపూర్ణతను, కృపను ఎట్లు అనుభవించగలరో సూచనగా నేర్పించుచుండెను. సంఖ్యాకాండము 15:37, 41లో నున్న భాగము నీలివర్ణము యొక్క భావమును తెలియజేయుచున్నది. వారు తమ వస్త్రముల అంచుకు నీలి సూత్రము కలిగి యుండవలెనని దేవుడు తన ప్రజలతో మోషేద్వారా చెప్పుచుండెను. వారు దేవుని ప్రజలనియు ఆయన తన కృపద్వారా వారిని రక్షించెననియు, వారు ఆయన ఆజ్ఞలకు లోబడవలె ననియు నీలివర్ణము వారికి జ్ఞాపకము చేయుచుండెను. అదే రీతిగా మనము పరిశుద్ధ జనమనియు, దేవుని సొత్తయిన ప్రజలమనియు నీలివర్ణము జ్ఞాపకము చేయుచున్నది (1 పేతురు 2:9). నీవు నిజముగా దేవుని సంపూర్ణతను అనుభవింప గోరిన యెడల ఆయన పరలోక పిలుపును గురించి నేర్చుకొనుము. పరలోక నివాస స్థలమును లేక పరలోక సంఘమును యేసుక్రీస్తు ప్రభువు యొక్క శిరస్సత్వము క్రింద కట్టుటకు పిలువబడు చున్నాము.

ధూమ్రవర్ణము రాజరికమును సూచించుచున్నది. యేసుక్రీస్తు ప్రభువును సిలువ వేయక మునుపు రాణువవారు ఆయనకొక ధూమ్రవర్ణపు వస్త్రమును తొడిగించి "యూదుల రాజాశుభమని" ఆయనను అపహసించిరి (యోహాను 19:2, 3). రాజులు మాత్రమే ఇట్టి ధూమ్రవర్ణపు వస్త్రములను ధరింతురు. యేసుక్రీస్తు ప్రభువు యొక్క రాజరికము క్రిందకి మనము రావలయునని దేవుడు కోరుచున్నట్లు దానిమ్మ పండ్లలో నున్న ధూమ్రవర్ణము తెలియజేయుచున్నది. ప్రతి విషయములోను ఆయన ద్వారా నడిపింపబడుటకు, ఆయనయొక్క ఆధీనములో నుండుటకు మనము ఇష్టపడవలెను.

ప్రోక్షణ రక్తమును సూచించుచున్న రక్తవర్ణము గల గొఱ్ఱెబొచ్చును

మోషే ఉపయోగించినట్లు హెబ్రీ. 9:19లో చదువుచున్నాము. దేవుని జత పనివారముగా నిర్దోషమైన, నిర్మలమైన మనస్సాక్షిని మనము కలిగి యుండవలెను. యేసుక్రీస్తు ప్రభువు రక్తములో కడుగబడుట ద్వారానే ఇట్టి మనస్సాక్షిని పొందగలము. కన్నీరు విడుచుట ద్వారా కాని, దీర్ఘ ప్రార్థనల ద్వారా కాని మనము శుద్ధీకరింపబడనేరము. దీనముగా ప్రభువును సమీపించి "యేసుప్రభూ! తలంపుల ద్వారా, మాటల ద్వారా, క్రియల ద్వారా నేను అపవిత్రుడనైతిని. నీ ప్రశస్త రక్తముతో నన్ను శుద్ధీక రించుము" అని ప్రార్థించిన యెడల వెంటనే ఆయన నిన్ను శుద్ధీకరించును. ఏదో దర్శనము కొరకు, అసాధారణమైన అనుభవము కొరకు కనిపెట్ట నవసరము లేదు. నీవు అడిగిన క్షణములోనే నీవు శుద్ధీకరింపబడుదువు. దేవుని సేవకులమైన మనము ప్రతి మాలిన్యము నుండి శుద్ధీకరింపబడుట ఎంతో అవసరము.

దేవుని సంఘ నిర్మాణములో పాలుపొందవలెననిన, ఆయన సంపూర్ణతను అనుభవింపవలెననిన ఆయన పిలుపు విని, ఆయన ప్రభుత్వము నెరిగి, శుద్ధమైన జీవితము కొనసాగించవలెనని నీల, ధూమ్ర, రక్త వర్ణములు తెలుపుచున్నవి.

దానిమ్మపండ్ల మధ్యలో బంగారు గంటలు కలవు. అవి రాగి లేక ఉక్కుతో చేయబడిన గంటలు కావు. గాని పరలోకనాదము కలిగిన బంగారు గంటలు. ప్రధాన యాజకుడు అటునిటు తిరుగునప్పుడు ఈ బంగారు గంటలు వింతైన శబ్దము చేయును. ఈ గంటల శబ్దము దేవుని మధుర స్వరమును సూచించుచున్నది. బంగారు గంటల శబ్దము అసమాన మైనదై రాగి, ఉక్కు లేక ఇతర గంటల శబ్దముకంటె వ్యత్యాసమైనదిగా నున్నట్లు, దేవుని స్వరము మానవుని స్వరముకంటె వ్యత్యాసమైనది. మనము దేవుని స్వరము వినునప్పుడు అది మానవ స్వరము కాదని

దేవుని స్వరమేయని అనుభవముతో ఎరుగుదుము. అది నిమ్మళమైన మెల్లని స్వరము. అది పరలోక స్వరము. అది అధికార సహితమైన ప్రేమగల మధుర స్వరము. ఆయన స్వరము వినుచుండగా మన హృదయములు ఆనందించును.

దేవుని స్వరము వినుటద్వారా మాత్రమే దేవుని సంఘ నిర్మాణములో పాలు పొందగలమని బంగారు గంటలు ప్రకటించుచున్నవి. ప్రస్తుత కాలములో డబ్బు వెచ్చించుటద్వారా, గొప్ప కార్యక్రమములద్వారా సంఘమును నిర్మించగలమని ప్రజలు తలంచుచున్నారు. ఎడతెగక దేవుని స్వరమును వినుచు, సంఘము నిమిత్తము దేవుని యేర్పాటును గ్రహించితేనేగాని దేవుని సంఘ నిర్మాణములో పాలుపొందుటకు వారు అర్హులు కారను విషయమును మరచిపోవుచున్నారు. ఆయన నిత్య నివాసమును నిర్మించుటలో ఆయన జతపనివారము కాగోరిన యెడల మొట్టమొదటగా మనము ఆయన స్వరము వినుటకు నేర్చుకొనవలెనని దేవుడు బంగారు గంటల మూలమున జ్ఞాపకము చేయుచుండెను. అందువలననే దీర్ఘకాలము మోకాళ్లపై నుండి మనమిట్లు ప్రార్థించవలెను. "ప్రభువా! నాతో మాట్లాడుము. నీ వర్తమానమిమ్ము, నన్ను నీ స్వరమును విననిమ్ము. నీ మార్గమును తెలియజేయుము. నన్ను సరియైన మార్గములో నుంచుము. నన్ను సాగిపోనిమ్ము, నన్ను బలపర్చుము. నీ కృప నాకను గ్రహించుము. తిరిగి జన్మించనివారు దేవుని స్వరమును వినజాలరు. దేవుని జతపనివారు కానేరరు.

# 5
# ఏఫోదు

ప్రధాన యాజకుడు నీలివస్త్రముపై ధరించు ఏఫోదును గమనించు దము. (లేవీ. కాం. 8:7). ఏఫోదు బంగారుతోను, నీల, ధూమ్ర, రక్తవర్ణము లతోను పేనిన సన్న నారతోను చేయబడెను (నిర్గ. కాం. 28:6). ఏఫోదు ఐదు రకములైన వస్తువులతో చేయబడి సుందరముగా ఆకర్షణీయమైన వస్త్రముగా నుండెను. ఏఫోదు వెలుగును సూచించుచు, మనము లోకమునకు వెలుగై యున్నామని జ్ఞాపకము చేయుచున్నది. విశ్వాసులు పాఠశాలలో, కర్మాగారములలో, వైద్యశాలలలో, మరెక్కడ ఉన్నను జ్యోతుల వలె ప్రకాశించవలెను. మన జీవితములలో యేసుక్రీస్తు ప్రభువు యొక్క గుణ లక్షణములు కనబడవలెను. ఆయన ప్రేమ, పరిశుద్ధత, సాత్వికము, సహనము, మృదుత్వము చుట్టునున్నవారికి మనలో కనబడవలెను. సువార్తను నమ్మనివారు మన వస్త్రధారణ, సంభాషణ, ప్రవర్తన, జీవిత విధానమును గమనించి మనము వారికంటె వేరైనవారమని ఒప్పింపబడుదురు.

ఏఫోదుయొక్క పైభాగమందు భుజములపైనున్న రెండు బంగారు జవలలో రెండు రత్నములు కలవు. ఒక రత్నము కుడిభుజము మీదను, రెండవ రత్నము ఎడమ భుజముమీద నుండెను (నిర్గ. కాం. 28:8, 9). అవి ఏఫోదులోని భాగములు. ఇశ్రాయేలు కుమారుల పంన్రెండు పేర్లలో ఒక రత్నముపై ఆరు పేర్లు, మరొక రత్నముపై ఆరు పేర్లు వారి జనన క్రమము చొప్పున చెక్కబడియుండెను (నిర్గ. కాం. 28:10). పంన్రెండు గోత్రములవారు సమానముగా ఆయనకు ప్రశస్తమైనవారని ఇది చూపించు చున్నది. దేవుడు మన సమస్త భారములను తన భుజముపై వేసికొన కోరుచున్నాడనికూడ ఇది చూపించుచున్నది.

యేసుక్రీస్తు ప్రభువు యొద్దకు మనము వచ్చునప్పుడు ఏదోనొక పొరపాటో, పతనమో లేక బలహీనతయో మనలో నుండును. నిర్దోషులుగా ఎవరూ లేరు. ఇట్టి బలహీనతలను తల్లిదండ్రుల యొద్దనుండె పొందుచున్నాము. వారు వారియొక్క తల్లిదండ్రుల యొద్దనుండి పొందిరి. మనమెల్లరము పాపములో జన్మించితిమి (దా. కీర్తన 51:5). తండ్రి ముక్కోపి యైనయెడల బిడ్డలు తప్పక ఆ గుణలక్షణమును పొందుదురు. తండ్రి డబ్బు కొరకు దురాశ కలిగియుండిన యెడల బిడ్డలుకూడా అట్టివారు గానే యుందురు. తండ్రి అహంకారముతో, గర్వముతో నిండిన హృదయము కలిగియుండిన యెడల అతని బిడ్డలు కూడా నట్టి హృదయమును కలిగి యుందురు. ఆ రీతిగా మన బలహీనతలను మన తల్లిదండ్రుల నుండి పొందుచున్నాము. మన బలహీనతలను సంస్కారము లేక కన్నీరు మొదలగు వాటివలన జయించలేము. అనుదినము మనలను మనము తగ్గించుకొని పతనములను బలహీనతలను ఒప్పుకొనునప్పుడు యేసుక్రీస్తు ప్రభువు మనలను మార్చివేయును.

యేసుక్రీస్తు ప్రభువు మన ప్రధాన యాజకుడు. మన భారములను ఆయన తన భుజములపై మోయును. మన సమస్త బలహీనతలతో, కొరతలతో, పతనములతో ఆయనను చేరు ఆధిక్యత మనకున్నది. గనుక విశ్వాసముతో ఆయనతో నిట్లనుచున్నాము : "నా ప్రభువా! నా కొరతలను, పతనములను తప్పిదములను ఒప్పుకొనుచున్నాను. నన్ను కరుణించుము. వీటన్నిటిపై నాకు విజయమనుగ్రహించుము". మన ప్రధాన యాజకుడుగా ఆయన మన భారములను కూడ మోయును (1 పేతురు 5:7) ఎట్టి బలహీనతలో నుండియైనను, కొరతలో నుండియైనను లేక పతనములో నుండియైనను నిన్ను మోసికొని పోవుటకై యేసుక్రీస్తు ప్రభువునకు బలమైన భుజమున్నదని నమ్ముము. బలహీనతలలో, పతనములలో ఆయన మన బలమైయున్నాడు. ఆయన మన ఉత్తరవాది (1 యోహాను 2:1). ఆయన విజ్ఞాపన వలన మన కొరతలన్నియు తీరి దైవిక సుగుణములుగా

మారుచున్నవి (హెబ్రీ. 7:25).

ఏఫోదును చేయుటకు వాడిన ఐదు వస్తువులు : బంగారము, నీలి, ధూమ్ర, రక్తవర్ణముల నూలు, పేనిన సన్ననార, యేసుక్రీస్తు ప్రభువు యొక్క సుగుణములకు సాదృశ్యముగా నున్నవి. క్రీస్తుయొక్క సుగుణములు మన జీవితములలో ఎట్లు అల్లుకొని యుండవలెనో ఈ వస్త్రము సూచించుచున్నది. ఐదు కృపను సూచించెడి సంఖ్య. ఇష్ట పూర్వకముగా ప్రభువుకు లోబడునప్పుడు దైవ సుగుణములు మనకు వచ్చును. క్రీస్తును పోలిన సుగుణములలో బయలుపడుచు, పరలోక సంగతులను మనము తెలుసుకొనుటకు సహాయపడు దైవ స్వభావమును బంగారము సూచించుచున్నది. బలమైన విశ్వాసముతో పరీక్షలను, శోధనలను మనము జయించునప్పుడు ఇట్టి సుగుణములు మనలో కనబడును (1 పేతురు 1:7).

ఏఫోదును నేయుటకు బంగారు తీగలనుకూడ వాడిరి. మొదటగా బంగారము అగ్నిలో కరిగింపబడి ఏడు పర్యాయములు అగ్నిలో శుద్ధీకరింప బడవలెను. క్రిందనున్న అగ్ని బంగారమును కరిగించును. పైన వేయబడు అగ్ని బంగారములోనున్న మష్టును తీసివేయును. అదే రీతిగా శ్రమలు, హింసలనెడి అగ్నిద్వారానే విశ్వాసి జీవితము శుద్ధీకరింపబడి దేవుని మహిమను బయలుపరచగలదు. గనుక లోకము నిన్ను తృణీకరించి, ద్వేషించి, హింసించిన యెడల ఆశ్చర్యపడకుము. నిన్ను శుద్ధ సువర్ణము వలె చేయు నిమిత్తము నీ జీవితములోనికి అగ్నివంటి అనుభవములను దేవుడు రానిచ్చును.

కరిగింపబడిన బంగారమును సుత్తితో కొట్టి పలకగా చేయవలెను. ఆ పలకను సన్నని ముక్కలుగా కత్తిరింపవలెను. మొదట ఒక్కొక్క ముక్కను పెద్ద ఇనుప పలకలో నున్న పెద్ద రంధ్రముల ద్వారా, ఆ తరువాత చిన్న

రంధ్రముల ద్వారా లాగబడవలెను. ఆ ఇనుప పలకలో నున్న రంధ్రము లన్నిటి ద్వారా బంగారు ముక్కను లాగినపుడు ఆఖరి చిన్న రంధ్రము ద్వారా వచ్చు బంగారు తీగెను ఏఫోదులో నేయవచ్చును. బంగారు కడ్డీతో గాని లేక పలకతో గాని ఏఫోదు నేయలేరు. గనుకనే ఆ బంగారు కడ్డీని అనేక పద్ధతుల ద్వారా తీసికొని పోవలయును. దానిని అగ్నిలో కరిగించ వలెను. సుత్తితో కొట్టవలెను. ముక్కలుగా చేసి అనేక రంధ్రముల గుండా లాగి సన్నని బంగారు తీగెలుగా చేయవలెను.

విశ్వాసులుగా శ్రమల ద్వారా పోనియెడల మనము క్రీస్తును పోలిన వారము కాలేమని వీటన్నిటి మూలమున నేర్చుకొనుచున్నాము. కష్టములు, ఇబ్బందుల యొక్క అనుభవము లేనివారు కఠిన హృదయులుగా నిర్దయులుగా నుందురు. వారు సాత్వికులుగా, దీనులుగా, దయగల వారుగా నుండరు. గనుక యేసుక్రీస్తు ప్రభువు యొక్క సుగుణములను బయలుపరచవలెను. వారు శ్రమలను పొందిన తరువాత సాత్వికులుగా, దీనులుగా మారుదురు. అధిక శ్రమల ద్వారా పోయిన వ్యక్తి ఎట్టి అయిష్టత చూపక గద్దింపును సహించగలుగుటయును, ప్రజలతని ద్వేషించినను, శపించినను పట్టించుకొనకుండుటయును, సుఖ భోగములలోనే జీవించిన మరియొక వ్యక్తి అల్ప కారణమునకే అభ్యంతర పడుటయును మీరు గమనించి యుండవచ్చును. అందువలననే క్రీస్తువలె దయగలవారిని గాను, మృదువైనవారినిగాను, జాలిగలిగిన వారినిగాను చేయు నిమిత్తము దేవుడు మనలను శ్రమలు, పరీక్షలనెడి శుద్ధిచేయు అగ్నిద్వారా తీసికొనిపోవును.

సంపూర్ణముగా యేసుక్రీస్తు ప్రభువునకు మనలను మనము లోపరచుకొనునప్పుడు మనకనుగ్రహించబడు పరలోక జ్ఞానమును నీలివర్ణము సూచించుచున్నది. మనము ఎంత అధికముగా ఆయన అధికారమునకు లోబడుదుమో అంత అధికముగా పరిశుద్ధాత్మ తన్ను తాను మనకు బయలుపరచుకొనును. అట్టి జ్ఞానము బలమైన విశ్వాసము

ద్వారా మన కనుగ్రహించబడును. అందువలననే బంగారుతీగె, నీలివర్ణ దారము కలిపి నేయబడినవి. ధూమ్రవర్ణము యేసుక్రీస్తు ప్రభువుయొక్క అధికారమును సూచించుచున్నది. అపవాదిని జయించు నిమిత్తము మనలో నివసించుటకు వచ్చిన యేసుక్రీస్తు ప్రభువు నామమున సాతానును బంధించెడి అధిక్యత మనకు గలదు. అదే శక్తిద్వారా ఇతరులకు విడుదల లేక స్వస్థత కోరవచ్చును (యోహాను 14:12-14). రక్తవర్ణము యేసుక్రీస్తు ప్రభువుయొక్క రక్తమును సూచించుచున్నది. "నేను యోగ్యుడను కాను. పరిశుద్ధ స్థలమును సమీపించు ధైర్యము నాకు లేదు" అని పలుమార్లు అనుచుందుము. కాని ప్రశస్త రక్తమందలి విశ్వాసము ద్వారా బహు ధైర్యముగా పరిశుద్ధ స్థలములోనికి వెళ్లి దేవుని వాగ్ధానములను, శక్తిని, కృపను కోరుకొనగలము (హెబ్రీ. 10:19). ఏఫోదులోనున్న తెల్లటి పేనిన సన్నని నార మనలో ప్రవహించుచున్న యేసుక్రీస్తు ప్రభువుయొక్క పవిత్రమైన జీవమును సూచించుచున్నది (గలతీ. 2:20). మనము ఆయనకు లొంబడుచున్నప్పుడు యేసుక్రీస్తు ప్రభువుయొక్క దీనత్వమును, దయను, సాత్వికమును, దీర్ఘశాంతమును ఇతరులు మనలో చూడగలరు.

బంగారు తీగెలు నీల, ధూమ్ర, రక్తవర్ణములతో, తెల్లటి పేనిన నారతో విపరీతమైన పరలోకపు నమూనాలో నేయబడెను. అట్టి నమూనాను లోకములో ఏ శిల్పియు తలంచలేదు. దేవుడు మోషేకు బయలుపరచెను. మోషే ద్వారా నేర్పరితనము గల మనుష్యులకు అది బయలుపరచబడెను. ఆ నమూనా అసమానమైనదిగా నున్నట్లు ఒక విశ్వాసియొక్క జీవితము లోకస్థుల జీవితమునకు సంపూర్ణముగా వ్యత్యాసమైనదిగా నుండవలెను. విశ్వాసి ఆత్మీయముగా ఎదుగుకొలది ఈ వ్యత్యాసము అధికముగా ప్రస్ఫుటమగును. అతని ద్వారా దేవుని మహిమ, ఘనత అధిక పరిమాణములో బయలుపడుచుండును. ఆ రీతిగా నతడు దేవుని సంపూర్ణతలో తన భాగము కొరకు సిద్ధపరచబడును.

* * *

# 6
# పతకము

ప్రధాన యాజకుడు ఏఫోదుపై ధరింపవలసిన పతకమును గమనించుదుము (నిర్గ. కాం. 28:15-21). పతకము ప్రధాన యాజకుడు ధరించిన వస్త్రములో అత్యంత సుందరమైనది. ఏఫోదునకు వాడబడిన వస్తువులైన బంగారము, నీలి, ధూమ్ర, రక్తవర్ణము, తెల్లటి పేనిన నారలే పతకమునకుకూడ వాడబడెను. ప్రపంచములో చాల ప్రశస్తమైన పండ్రెండు రాళ్లు పతకములో పొదుగబడెను. ఒక్కొక్క వరుసలో మూడు చొప్పున నాలుగు వరుసలలో ఈ రాళ్లు పొదుగబడెను. అవి ప్రశస్తమైన, ప్రకాశమైన, సుందరమైన రాళ్లు. దారిని పోవువారెవరైనను ప్రధాన యాజకుని పతకములో ప్రకాశించుచున్న ఆ రాళ్లను చూడగలరు. "ఓ నా ప్రజలారా! మీరు సంపూర్ణముగా పాపముచేత పాడుచేయబడినను, మీకెట్టి నిరీక్షణ లేకపోయినను, నా శక్తిద్వారా, కృప ద్వారా ఈ రాళ్లవలె మీరు మారగలరు" అని దేవుడు చెప్పుచున్నట్లుండెను. పాడైపోయిన ప్రతి పాపి కూడా రూపాంతరమొంది ప్రకాశమానమైన ఈ రాళ్లవలె కాగలడు. నీ వెవరవైనను, ఎన్ని పాపములు చేసియుండినను ఫరవాలేదు. ఆయన కృప, శక్తి ద్వారా నీవు నూతన సృష్టిగా మార్చబడుదువు.

నా అనుభవములో ఎరుగుదును. నాయంత పాపిష్టివాడు మరొకడుండడు. దౌర్భాగ్యుడైన పాపినని నేనెరుగుదును. 1919వ సంవత్సరమునందు గ్రుడ్డితనములో బుద్ధిహీనతచేత బైబిలును చింపివేసితిని. పది సంవత్సరములు దేవుని ప్రజలకు బైబిలునకు విరోధముగా దేవదూషణ మాటలు పలికితిని. క్రైస్తవులెవరూ నాకే హాని చేయకపోయినను నా కుటుంబములో గాని లేక సిక్కుమత యాజకులలో గాని ఎవరు క్రైస్తవు

లకు, బైబిలునకు విరోధముగా ఎన్నడును ఒక్క మాటైనను పలుకక పోయినను యేసుక్రీస్తు ప్రభువునకు, బైబిలునకు, దేవుని ప్రజలకు విరోధముగా నా హృదయములో ద్వేషముండెను. మూడు సంవత్సరముల కన్న అధిక కాలము అవమానకరమైన జీవితమును కొనసాగించితిని. దేవుడు లేడనికూడ పలికితిని. అయినను కృపగల దేవుడు నన్ను వెదకి రక్షించెను. నన్ను శుద్ధీకరించి మార్చివేసెను. అధమ పాపినైనను ఆయన నన్ను ప్రేమించెను. ఆయన ప్రతి పాపిని ప్రేమించును. నీ వెవరవైనను ఇకనుండి ఆ దుష్టమైన పాపస్థితిలో జీవించవలదని పలుమారు నిన్ను బ్రతిమాలుచున్నాడు. నీ జీవితములో అపవాదికి చోటియ్యకుము. యేసుక్రీస్తు ప్రభువు నిన్ను రక్షించి, మార్చి ప్రకాశించుచున్న, మెరయుచున్న ఆ సుందరమైన రాళ్లవలె చేయునుగాక.

పతకము జానెడు పొడుగు, జానెడు వెడల్పు ఉండెను (నిర్గ. కాం. 28:16). ఒక జాన మానవుని కొలత, పూర్వ దినములలో వస్త్రములను కొలుచుటకు వ్రేళ్లను, బెత్తను ఉపయోగించెడివారు. గ్రామములలో యింకను ఇది వాడుకలో నున్నది. ఈ దినములలో రక్షణ ప్రతి మానవుని అందుబాటులో నున్నదని దేవుడు దీనిద్వారా చూపించుచుండెను. ఆయన కృపద్వారా బైబిలు గ్రంథము 1155 భాషలలో ముద్రించబడుచు, రాజులకు, అన్ని తరగతులకు చెందిన ప్రజలకు అందుబాటులో నున్నది.

మెరయుచు ప్రకాశించుచున్న ఆ ప్రశస్తమైన రాళ్లవల్ల ప్రభువునకు మనము ప్రశస్తమైనవారమగు చున్నాము. నల్లని బొగ్గు ముక్కను తీసికొని చాల లోతున భూమిలో పాతిపెట్టుము. అనేక శతాబ్దముల తరువాత ఉష్ణము ఒత్తిడి వలన బొగ్గు వజ్రముగా మారును. ఉష్ణము, ఒత్తిడి వలన ఒక బొగ్గుముక్క వజ్రముగా మారగలిగిన యెడల ఎంత ఎక్కువగా ఆయనయొక్క ప్రశస్త రక్తము మనలను విలువైన ముత్యములవలె

మార్చగలదు? దేవుని దృష్టిలో మనము మిక్కిలి ప్రశస్తమైనవారము. ఇతరులు వేర్వేరు పేర్లుపెట్టి మనలను పిలువవచ్చును. మన పొరుగువారు, బంధువులు, వేర్వేరు పేర్లుపెట్టి మనలను ఎగతాళి చేయుచు బుద్ధిహీనుల మని, మొండివారమని యనవచ్చును; కాని మనమాయన ప్రశస్త రక్తముచేత విమోచింపబడినందున మనమాయన స్వకీయ సంపాద్యమని యేసుక్రీస్తు ప్రభు వనుచుండెను (నిర్గ. కాం. 19:5; ద్వి.కాం. 14:2). 'యాకోబు' అను పేరునకు 'మోసగాడు' యనియు, 'ఇశ్రాయేలు' అను పేరునకు 'అధిపతి' యనియు అర్థము. మనము తిరిగి జన్మించక మునుపు మోసముతో నిండిన నల్లని యాకోబు యొక్క స్వభావమును కలిగియుంటిమి. ఆయనయొద్దకు వచ్చుట ద్వారా మార్చబడి, అధిపతులముగా, ఇశ్రా యేలుగా మారుచున్నాము. ఆయన ప్రశస్త రక్తముచేత కొనబడినవారిని పతకము సూచించుచున్నది. ఆయనకు వారు అత్యంత ప్రశస్తమైనవారు. వారిని కొనుటకు తనయొద్దనున్నదంతయు ఆయన చెల్లించెను.

మత్తయి 13:44-46లో ఒక పొలము కొరకు వెదకుచున్న వ్యక్తిని గురించి చదువుచున్నాము. అతడు అనుభవము గలవాడు గనుక ఒక పొలములో దాచబడిన ధనమును కనుగొనెను. ఆ పొలమును కొనుటకు తనకున్నదంతయు అమ్మివేయును. ఆ దాచబడిన ధనమును అతని కన్నులు చూడగలిగెను. అదే రీతిగా బెంగుళూరు దగ్గర బంగారము కనుగొనబడెను. బెంగుళూరు దగ్గర కోలారు అను స్థలము కలదు. అనేక సంవత్సరములది అడవిగా నుండెను. ఒక దినమున భూగర్భ శాస్త్రము నెరిగిన ఒక సిపాయి కోలారులో బంగారమున్నదని కనిపెట్టెను. అతడు అక్కడక్కడ త్రవ్వుచుండెను. ఒకటి రెండు స్థలములలో అతడు బంగారమును కనుగొనెను. అప్పుడతడు ఆ పొలమును కొనెను. అదే రీతిగా మనలో నొక దాచబడిన ధనమును ప్రభువు కనుగొనెను. మన తోటి మానవులు దానిని చూడలేరు. వారు మన బుద్ధిహీనతను,

బలహీనతను, పతనములను మాత్రమే చూడగలరు. కాని యేసుక్రీస్తు ప్రభువు మన సృష్టికర్త. గనుక మనలో గుప్తమైయున్న ఐశ్వర్యమును చూడగలిగెను. మనలను కొనుటకు తనకున్న సమస్తమును ఆయన ఇచ్చివేసెను. ఆయన తన సింహాసనమును, మహిమను విడిచిపెట్టెను. ఆయన ఒక శిశువై, పశువుల తొట్టిలో జన్మించెను. ఆయన సంపూర్ణముగా తన్ను తాను రిక్తునిగా చేసికొనెను. కడపటికి మేకులు కొట్టబడుటకు చేతులను, కొరడాలతో కొట్టబడుటకు వీపును, పెరకబడుటకు వెంట్రుకలను, ఉమ్మివేయబడుటకు ముఖమును ఆయన అప్పగించెను. పాపముతో, క్రుళ్లుతో నిండిన మనలను ప్రశస్తమైన రాళ్లవలె చేయుటకు తన ప్రశస్త రక్తముతో ఆయన మనలను కొనెను.

దేవుని సంపూర్ణత అంతమున ఆయన సంఘము ద్వారా బయలు పడవలెను (ఎఫెసీ. 1:23). దేవదూతల ద్వారా లేక ఇతర పరలోక జీవుల ద్వారా అది బయలుపడనేరదు. అదే రీతిగా దేవుని నానా విధమైన జ్ఞానము దేవుని మహిమ, దేవుని శక్తి, దేవుని కృపా ప్రేమలు, దేవుని సంకల్పము ఆయన సంఘము ద్వారానే బయలుపడును. అందువలననే సంఘము ఆయనకు ఎంతో ప్రశస్తమైనదిగా నున్నది. మనమూ సంఘములో ఒక భాగముగా నుండవలెనని కోరుచున్నాడు. సంఘములో మనలను ఒక భాగము చేయుటకాయన సాధ్యమైన ప్రతి పద్ధతిని వినియోగించు చున్నాడు. ఇశ్రాయేలు పంన్రెండు గోత్రముల పేర్లు చెక్కబడి, పతకములో పొదుగబడిన పంన్రెండు రాళ్ల వలన ఈ ప్రశస్తత సూచింపబడుచున్నది. ఈ పంన్రెండు పేర్లయొక్క ఆత్మీయ పాఠములను తరువాత నాలుగు అధ్యాయములలో ధ్యానించెదము.

☆ ☆ ☆

# 7
# యూదా, ఇశ్శాఖారు, జెబూలూను

ఆ పతకము మీదనున్న పంద్రెండు రాళ్లమీద పంద్రెండు గోత్రముల పేర్లు, వారి ప్రయాణ క్రమములో చెక్కబడినవి. ఐగుప్తునుండి కనానుకు ప్రయాణము చేయునప్పుడు వారెక్కడ ఆగినను, బసచేసినను, ఆ క్రమమునే వారు పాటించవలసి యుండును. ఆ క్రమమేదనగా యూదా, ఇశ్శాఖారు, జెబూలూను గోత్రములవారు తూర్పువైపున రూబేను, షిమ్యోను, గాదుగోత్రముల వారు దక్షిణము వైపుణ; ఎఫ్రాయీము మనష్షే బెన్యామీను గోత్రములవారు పశ్చిమ వైపున; దాను, ఆషేరు నఫ్తాలీ గోత్రములవారు ఉత్తరములవారు ఉత్తరము వైపున బస చేయవలెను (సంఖ్యా కాం. 2). ఈ క్రమము నెన్నటికిని మార్చకూడదు. దేవుని హృదయమునకు అతి సమీపములో నుండుటకు అవసరమైన పంద్రెండు ఆత్మీయ అనుభవముల క్రమమును ఇది తెలుపుచున్నది. రెండు రత్నములమీద వారి జన్మ క్రమములో పేర్లు వ్రాయబడినవి (నిర్గ. కాం. 28:9, 10). వారి ప్రయాణమునకు, బస చేయుటకు దేవుడు వారి సహజ క్రమమును మార్చెను. ఎట్టి మానవ యోగ్యతలపై ఆయన లక్ష్యముంచడని దేవుడు చూపించుచుండెను. "మనుష్యులు పై రూపమును లక్ష్యపెట్టుదురు గాని యెహోవా హృదయమును లక్ష్యపెట్టును" (1 సమూ. 16:17).

పౌలు స్థానములో మరొక వ్యక్తిని కనుగొనుమని దేవుడు సమూయేలు ప్రవక్తను పంపించెను. యెష్షయి తన పెద్ద కుమారుడైన ఏలియాబును అతని యెదుటికి తెచ్చెను. సమూయేలు అతని యెత్తును, ముఖ రూపమును చూచి అతడు రాజుగా నుండుటకు తగినవాడని

తలంచెను. కాని దేవుడు, "పై రూపమును చూచి మోసపోకుము. అతనిని నేను ఎన్నుకొనలేదు. అతనిని వినియోగించలేను" అని సెలవిచ్చెను. యెష్షయి తన కుమారులనందరిని ఒకరి తరువాత ఒకరిని సమూయేలు యెదుటికి తెచ్చెను. వారిని తాను ఎన్నుకొనలేదని దేవుడు సెలవిచ్చెను. కడపటికి దావీదు సమూయేలు ఎదుటికి వచ్చినప్పుడు దావీదును అభిషేకించుమని సమూయేలుకు దేవుడు ఆజ్ఞాపించెను. ఆ రీతిగా నీవు పై రూపముచేత మోసగింపబడవచ్చును. నీ మాటలద్వారా, ముఖ రూపము ద్వారా నీవు కూడా ఇతరులను మోసగింపవచ్చును. ఇతరులు నిన్ను చూచి, "ఎంత మంచి క్రైస్తవుడు! ఎంత దయగలవాడు; ఎంత భక్తిపరుడు!' ' అని పొగడవచ్చును. కాని నీ గృహములో కోపముతో, దుర్మార్గతతో నిండిన వ్యత్యాసమైన వ్యక్తిగా నున్నావు.

ప్రశస్తమైనవారమగుటకు ఆయన దైవిక క్రమములోనికి, ఆయన పరలోక ఏర్పాటులోనికి మనము రావలెనని దేవుడు చెప్పుచుండెను. అంతరంగికముగా మనము మార్చబడుచుండగా, ఆయన పరలోక ఏర్పాటులోనుండ ఇష్టపడినప్పుడు ఆయన హృదయము చెంతకు మనము తేబడుచున్నాము. "నీవు నాకెంతో ప్రశస్తమైనవాడవు. నిన్ను ధారాళముగా నిరంతరము ప్రేమించుచు, నీలో నా సంపూర్ణతను పోయగలుగునట్లు నీవు నా హృదయమునకు సమీపముగా నుండవలెనని కోరుచున్నాను" అని సామాన్యమైన రీతిగా దేవుడు పలుకుచుండెను.

జీవితములో అనేక పరీక్షలను, శోధనలను మనము ఎదుర్కొన వలసి యున్నది. దేవుని నుండి మనలను దూరపరచుటకు సాతాను వీటిని వినియోగించి, పలుమార్లు సఫలుడగుచుండును. అందువలననే శత్రువు పన్నాగములను మనము జయించి, ప్రభువుయొక్క సమీపమునకు

చేరగలుగుటకు తగు సదుపాయమును దేవుడు చేసెను. పతకముయొక్క పం(డెండు రాళ్లు సూచించుచున్న పం(డెండు అనుభవములు మనము దేవుని హృదయమునకు సమీపముగా నుండుటకు సహాయపడును. వాటి ద్వారా ఆయన కృప, (పేమ, సమాధానము, ఆనందము, దీర్ఘశాంతము, సహనము, మృదుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వీకము (గహించగలుగుదుము.

## 1. యూదా :

మొదటి వరుసలోని మొదటి రాతిపై యూదా గో(తపు పేరు (వాయబడెను. **యూదా** అనగా "స్తుతి" అని యర్థము. ఇ(శాయేలు జనాంగము సాగిపోవునప్పుడు యూదా అందరికంటె ముందుండి మిగిలిన వారిని నడిపించవలెను. మన జీవితములలో కూడ స్తుతి యారాధన (ప్రథమ స్థానమును వహించవలెను. అన్ని సమయములలో ఆయనను స్తుతించి, ఆరాధించుటకు మనము నేర్చుకొనవలెను. ఇది మనము కలిగి యుండవలసిన ఆత్మీయ అనుభవములలో (ప్రథమమైనది.

మనము తిరిగి జన్మించినప్పుడు మొదటిగా బైబిలు జ్ఞానమును కలిగి యుండవలెనని కోరుచుందుము. అధిక బైబిలు జ్ఞానము కలిగి యుండుట ద్వారా ఆత్మీయముగా ఎరుగుదుమని భావించుదుము. మనము ఎన్ని పుస్తకములు చదివినను లేక ఎన్ని డి(గీలు కలిగియుండినను బైబిలు జ్ఞానము ద్వారా ఆత్మీయముగా ఎదుగలేము. ఎల్లప్పుడు (ప్రతి సందర్భములో ఆయనకు కృతజ్ఞత చెల్లించి, ఆయనను స్తుతించి, పూజించి, హెచ్చించుటకు నేర్చుకొనినప్పుడు మనము ఆత్మీయముగా ఎదుగగలము. నీవు దినమును ఆరంభించక మునుపు కొన్ని క్షణములు ఎట్టి మనవి, విన్నపము చేయక స్వచ్ఛమైన ఆరాధనలో గడుపుము. ఆయనతో

ఈలాగనుము. "ప్రభువా! నీతో ఉండుటకు, నీ సన్నిధిని అనుభవించుటకు, నీ స్వరము వినుటకు, నీ మహిమాలంకారములు చూచుటకు నీయొద్దకు వచ్చుచున్నాను". ఆయన సన్నిధిని నీవు అనుభవించునప్పుడు ఆయన రాజుల రాజు గనుక ఆయనను ఆరాధించుము. ఆయన కృపా కనికరములను బట్టి, దయాదాక్షిణ్యములనుబట్టి ఆయనను స్తుతించుము. ప్రతి కష్టమును బట్టి ఆయనకు కృతజ్ఞత చెల్లించుము. నీ కష్టతరమైన జీవితమునుబట్టి చింతించక ఆయనకు వందనములర్పింపుము. ఎందుకనగా దేవుడు ఎన్నడును పొరపాటు చేయడు. ఆయన ఒక ఉద్దేశముతోనే వాటిని నీ జీవితములోనికి రానిచ్చును. గనుక ప్రతి విషయములోను దేవునికి కృతజ్ఞత చెల్లించవలెను (ఫిలిప్పీ. 4:6). మన ప్రభువు మనలను ఎట్టి క్లిష్ట పరిస్థితిలో నుంచినను, రోగములోగాని, దారిద్ర్యములోగాని లేక ఎట్టివిధమైన శ్రమయైనను మనము ఆయనను స్తుతించి, పూజించి ఘనపరచగలము. ఎందుకనగా ఒక ఉద్దేశముతోనే ఆయన సమస్తమును రానిచ్చుచున్నాడు. ఎంత అధికముగా ఆయనను ఆరాధించుదుమో అంత అధికముగా ఆత్మలో ఎదుగుచుందుము.

స్తుతి ఆరాధనలు విజయమునకు రహస్యములు. ఒకప్పుడు గొప్ప సైన్యము యూదా మీదికి దండెత్తి వచ్చెను. శత్రు సమూహమును చూచిన వెంటనే ప్రజలు భయముతో నిండిపోయిరి. కాని యుద్ధములో యూదా జనాంగము జయించునని వారికి తెలియచేయుటకై ప్రవక్తను దేవుడు వారియొద్దకు పంపెను. ప్రజలు అతని మాటలను నమ్మి దేవునికి స్తుతులు చెల్లించుచు యుద్ధమునకు సాగిపోయిరి (2 దిన వృత్తాం. 20 : 21, 22). వారంతట వారు యుద్ధము చేయకపోయినను, శత్రువులు నాశనము చేయబడిరి. అదే రీతిగా అన్ని పరిస్థితులలో ప్రభువును ఆరాధించి, ఘనపరచి హెచ్చించుటకు మనము నేర్చుకొనినయెడల మనకు

విరోధముగా వచ్చు శత్రువుయొక్క ఎదిరింపుల నన్నింటిని విఫలము చేయగలము. అనేకులు తమ బైబిలు జ్ఞానము ద్వారా శత్రువును ఓడింప జూతురు. కొందరు ఉపవాసములద్వారా, మరికొందరు దీర్ఘ ప్రార్థనల ద్వారా శత్రువును ఓడించ ప్రయత్నింతురు. అట్టి పద్ధతులు శత్రువు యెదుట పనిచేయవని త్వరలోనే వారు కనుగొందురు. తుదకు వారే ఓడపోవుదురు. ఆ రీతిగా ఆత్మతో, సత్యముతో ప్రభువును ఆరాధించి, స్తుతించుట ద్వారా శత్రువును ఓడించగలమను ఆత్మీయ పాఠమును మొదటిరాయి బోధించు చున్నది. (యోహాను 4:24; దా.కీ. 34 : 1 3; 89; 1; 104; 33; 105; 5).

## 2. ఇశ్శాఖారు :

రెండవ రాతిమీద ఇశ్శాఖారు అను పేరు గలదు. 'ఇశ్శాఖారు' అనగా 'దేవుడే నా ప్రతిఫలము' లేక జీతము (ఆది కాం. 30:18) భూ సంబంధమైన ఎట్టి బహుమానమైనను, ఏ మానవుని దయనైనను కోరవలదని ఈ పేరు బోధించుచున్నది. ఎవరికైన ఉపకారము చేసినను, దేవుని మందిరములో ఏ పనినైనను చేసిన యెడల ఏ మానవుని యొద్దనుండి ఎట్టి బహుమానమునైనను కోరవద్దు (ఆశించవద్దు). ఎందుకనగా ప్రభువే నీ బహుమానము. ప్రతిఫలము, సమస్తమును ప్రభువు నిమిత్తము చేయుడి (కొలొస్సై. 3:23).

ఉపాధ్యాయులు కొందరు వారి పాఠశాల తనిఖీ చేయకముందు ఒక వారము మిక్కలి కష్టపడి పనిచేయుదురు. గదులను బహు శుభ్రముగా నుంచుదురు. విద్యార్థులకు బాగుగా పాఠములు చెప్పుదురు. ఇన్‌స్పెక్టరు విద్యార్థులను ప్రశ్నించినప్పుడు వారు సరిగా జవాబులు చెప్పుదురు. ఇన్‌స్పెక్టరు వీటన్నిటిద్వారా బహుగా సంతోషించి ఉపాధ్యాయులను, పాఠశాలాధికారులను మెచ్చుకొనును. కాని తనిఖీ ముగిసిన పిదప పాఠశాల

నెవరు పట్టించుకొనరు. పాఠశాల మురికిగా నుండును; విద్యార్థులకు పాఠములు సరిగా చెప్పరు. పాఠశాల తనిఖీ నిమిత్తము మాత్రమే పని చేయుచుండురు.

కొందరు కూటములలో దీర్ఘ ప్రార్థనలు చేయుదురు. గాని ఇంటిలో మూడు నిమిషములు మాత్రమే ప్రార్థించుదురు. మనుష్యులను మెప్పించుటకు మాత్రమే కొందరు పనులు చేయుదురు. అట్టివారికి బహుమానము లభించదు. మీ ఆఫీసులలోగాని, దేవుని మందిరములో గాని ప్రతి పనిని నమ్మకముగా, పట్టుదలతో, ప్రేమపూర్వకముగా చేయుడి. స్వల్పకార్యములలో కూడ నమ్మకముగా నుండుటకు నేర్చుకొనుము (లూకా 16:10). మనమేమి పలికినను, చేసినను, ప్రభువు నిమిత్తము ఆయన నామమునందే చేయుదుముగాక. ఇది రెండవ యనుభవము. మొదటి యనుభవము ఆరాధన, దానివెంట సమస్తమును నమ్మకముగా చేయవలెనని ఆశ వచ్చును. ఈ అనుభవముసహా మనలను దేవుని హృదయము చెంతకు కొనిపోవును.

## 3. జెబూలూను :

మొదటి వరుసలోని మూడవ రాతిమీద జెబూలూను గోత్రపు పేరు చెక్కబడెను. ఇది మన ప్రభువునకు సమీపముగా చేయుటకు సహాయపడు అనుభవమును సూచించుచున్నది. **జెబూలూను** యనగా "నివాసము" (ఆది కాం. 30:20). నా హృదయము, నా శరీరము, నా గృహము ప్రభువుయొక్క నివాస స్థలముగా మారవలెను. నా సంఘము ఆయన యొక్క నివాస స్థలముగా నుండవలెను. ఇవన్నియు ఒకటిగా నుండవలెను. నీలి వస్త్రములో నుండికూడ అట్టి పాఠమునే నేర్చుకొంటిమి. దేవుని మందిరమును నిర్మించవలెననిన మొట్టమొదట మన దేహములు

దేవుని ఆలయము కావలెను (1 కొరింథీ. 3:16, 17). ఇక్కడ నొక తీవ్రమైన హెచ్చరిక యున్నది. దేవుని మందిర నిర్మాణములో పాలుపొందవలెననిన దేవుని నివాస స్థలము కాగలుగుటకు అర్హమైనవిగా మన దేహములను శుభ్రముగా, పరిశుద్ధముగా నుంచుకొనవలెను. మన జీవితములను, దేహములోని ప్రతి భాగమును శుభ్రముగా నుంచుకొనవలెను. అప్పుడు పరిశుద్ధాత్మ ధారాళముగా పనిచేయును. మనలో జీవించ గలుగును. లేనియెడల ఆయన మన ప్రయాసము అంగీకరించడు. తలంపు వలన, క్రియల వలన, మాటల వలన మనము అపవిత్రులమైనప్పుడెల్లా శుద్ధీకరణ కొరకు ఆయన ప్రశస్త రక్తమును కోరుకొనవచ్చును. ఆ రీతిగా ఆయన ఉపయోగము నిమిత్తము మన దేహమంతటిని శుభ్రముగా, పవిత్రముగా, నిష్కళంకముగా నుంచుకొనగలము.

అదే రీతిగా మన గృహముకూడ ఆయన నివాస స్థలముగా నుండ వలెను. యోహాను 12వ అధ్యాయములో ఒక గృహమును గురించి చదువు చున్నాము. యేసు ప్రభువు జీవించగలిగిన సంతోషకరమైన, అసమానమైన గృహమది. యెరూషలేములో అనేక గృహములుండినను, యేసు ప్రభువు ఒక రాత్రియంతటిని ఎన్నడును అచ్చట గడుపలేదు. సాయంత్రమున బేతనియకు గాని లేక ఒలీవల కొండకుగాని వెళ్లుచుండును. ఎడతెగని ఆయన సాన్నిధ్యము ద్వారా ఆ గృహము సంతోష గృహముగా మారెను. మాటలలో మాత్రమే గాక క్రియాపూర్వముగా యేసుక్రీస్తు ప్రభువు ఆ గృహమునకు సజీవమైన శిరస్సుగా నుండెను. యోహాను 12లో చెప్పబడిన బేతనియ గ్రామమందలి గృహములో నున్న లాజరు పునరుత్థాన శక్తిని కోరుకొనుటకు మనము నేర్చుకొనవలెను. అక్కడనున్న భోజనము, సహవాసములో మనమానందించు దేవుని వాక్యమునకు సాదృశ్యముగా నున్నది. సణుగు గొణుగులు, అసూయలు లేని ఆనందముతో కూడిన

పరిచర్యను పూర్తి సూచించుచున్నది. మరియు సంపూర్ణ భక్తి కృతజ్ఞతా స్తుతులను సూచించుచున్నది. వీటన్నిటిని కలిగియుండిన యెడల మన గృహము సంతోష గృహముగా నుండగలదు. అట్టి గృహములో యేసుక్రీస్తు ప్రభువు జీవించగలుగును. గనుక ఒక సంతోష గృహములో ఐదు లక్షణములుండవలెను. యేసుక్రీస్తు ప్రభువు యొక్క శిరసత్వము, అధికారము, ఇహసంబంధమైన శ్రమల నిమిత్తము పునరుత్థాన శక్తి; మన అనుదిన ధ్యానము నడిపింపు కొరకు దేవుని వాక్యము; ధనికులైనను, పేదవారైనను ఇతరులకు ఆనందముతో కూడిన పరిచర్య. అన్ని పరిస్థితులలోను ప్రభువు యెడల దీనత్వముతో కూడిన భక్తి ప్రేమలు.

అదే రీతిగా మనము దేవుని సంఘమును నిర్మింపవచ్చును. యేసుక్రీస్తు ప్రభువు యొక్క శిరస్సత్వమును గుర్తించుటద్వారా పునరుత్థాన శక్తిని కలిగియుండుట ద్వారా, అధికారముతో శక్తితో నియ్యమించు దేవుని వాక్యము ద్వారా, ఇతరులకు సేవా పరిచర్యలు చేయుటద్వారా, కలిసి ఆరాధించుట నేర్చుకొనుట ద్వారా దేవుని సంఘమును నిర్మించగలము. ఇట్టి లక్షణములు కలిగియుండుట ద్వారానే దేవుని సంఘము ఆయన యొక్క నివాస స్థలము కాగలదు. దేవుని నివాస స్థలముయొక్క నిర్మాణములో పాలుపొందునప్పుడు దేవుని సన్నిధియొక్క సామీప్యతను గుర్తించగలము.

దేవుని మందిర నిర్మాణములో ప్రతి విశ్వాసికి భాగమున్నది. మన దేహములు దేవుని ఆలయములైనప్పుడు ఆయనను, ఇతరులను సేవించు విధానమును ఆయన తెలియజేయును. ప్రతి విశ్వాసికి భాగమున్న పరలోక సంఘము నిమిత్తము పరలోక పథకము మనకు బయలుపరచును. విశ్వాసులనేకులు ప్రసంగముల కొరకు పాటల కొరకు లేక వేరే ఉద్దేశముతో దేవుని మందిరమునకు పోవుచుందురు. కొద్దిమంది మాత్రమే ఆయనను

సేవించుటకు, పరిచర్య చేయుటకు పోవుచుందురు. ఆయన మననుండి ఎట్టి పరిచర్య కోరుచుండునో ప్రార్థన ద్వారా తెలిసికొనగలము. అక్కరలో నున్నవారికి సహాయము చేయవలెనని, దుఃఖములో, నిరుత్సాహములో నున్నవారిని ఆదరించవలెనని కోరుచున్నావా? అట్లయిన యెడల ఈ రీతిగా ప్రార్థించుము. "ప్రభువా! బలహీనతలో, పేదరికములో, రోగములో, నిరుత్సాహములో నున్నవారి నిమిత్తము నీ ఆలోచన, నీ వర్తమానము ననుగ్రహించుము". ఆ రీతిగా దేవుని నివాస స్థలమును నిర్మించుటలో మనము పాలుపొందగలము.

✦ ✦ ✦

# 8

# రూబేను, షిమ్యోను, గాదు

## 4. రూబేను

రెండవ వరుసలో నున్న రాళ్లపై రూబేను, షిమ్యోను, గాదు అను పేర్లు గలవు. **రూబేను** అనగా "యెహోవా చూచెను" లేక "యెహోవా నా శ్రమను చూచియున్నాడు" (ఆది కాం. 29:32) అని అర్థము. నీ కష్టము లెట్టిదైనను, నీ బాధలను, శ్రమలను, పేదరికమును, పరీక్షలను ప్రభువు చూచెనని హృదయపూర్వకముగా నమ్ముము. మానవ సానుభూతిని కోరకుము. దుఃఖములలో నిన్ను ఎట్లు ఆదరించవలయునో, కష్టములలో నీకు ఎట్లు సహాయము చేయవలయునో ఆయనకు మాత్రమే తెలియును.

పౌలు మిక్కుటమైన శ్రమల ననుభవించెను (2 కొరింథీ. 1:3-10). అతనిని ఆదరించువారెవరు లేకపోయిరి. అతడు శక్తికిమించిన బాధల ననుభవించెను. వాస్తవమునకు జీవించుదునను ఆశ అతనికి లేకుండెను. అప్పుడు దేవుడు అతని సహాయమునకు వచ్చి, అతనిని విడిపించెను. అందువలననే తానిప్పుడు ఇతరులను ఆదరించగలనని పౌలు చెప్పెను. ఇబ్బందిలో నున్నవారికి సహాయము చేయు నేర్చుకొనగలుగునట్లు దేవుడతని జీవితములోనికి అట్టి శ్రమలను రానిచ్చెను.

బహుశా నీకు అనేక శ్రమలు వచ్చియుండవచ్చును. దేవునికి విరోధముగా సణిగి, "ప్రభువా, నీకు విరోధముగా నేనేమి తప్పు చేయలేదే. ఇట్టి శ్రమలనెందుకు నా జీవితములోనికి రానిచ్చితివి?" అని పలికితివి. నీ పాపములకు శిక్షగా దేవుడు ఈ శ్రమలను పంపించలేదు. గాని అట్టి అక్కరలో నున్నవారికి ఆదరణ కారణముగా నీవుండగలుగుటకు నిన్ను

**తర్ఫీదు చేయు నిమిత్తమై ఆ శ్రమలను పంపించెను.**

**పలు విధములైన** శ్రమలు, దు:ఖములు, **కష్టముల ద్వారా దేవుడు** మనలను ఒక పరలోకపు బాధ్యత కొరకు సిద్ధపరచుచున్నాడు. వీటన్నిటి ద్వారా మనము ఆత్మీయముగా బలపరచబడుచున్నామని ఎరుగుదుము. దృష్టాంతమునకు ఎత్తైన పర్వతములమీద బలమైన చెట్లు ఎత్తుగా పెరుగుచుండును. అవి అంత ఎత్తుగా ఎట్లు పెరుగుచున్నవి? గాలి బలముగా వీచుట వలన ఆ చెట్లు ఎత్తుగా పెరుగుచున్నవి. తీవ్రమైన గాలి వీచునప్పుడు చెట్ల వేరులు లోతునకు పోవుచుండును. ప్రతి తుఫాను వేరులను లోతుగా పోనిచ్చును. గాన ఆ చెట్లు పెకలింపబడనేరవు. అందువలననే అవి చాలా లావుగా నుండి ఎత్తుగా పెరుగుచుండును. అదే రీతిగా ప్రతి జీవిత తుఫాను, కుటుంబ కలహము లేక యితర కష్టము మనలను శిక్షించుటకుగాక ఆత్మీయముగా మనలను శక్తిమంతులనుగా జేయుటకే వచ్చుచున్నవి. అట్టి ఉద్దేశముతోనే ప్రభువు దావీదును అనేక శ్రమల ద్వారా పోనిచ్చెను. (దా.కీ. 18:4 6; 16-19). ఒక్కొక్క శ్రమ, కష్టము, పరీక్ష, ఇబ్బంది దావీదును ఆత్మీయ విశాలతలోనికి నడిపించెను (దా.కీ. 66:10-12). మనందరియెడల అదియే దేవుని ఉద్దేశము.

నేను రక్షింపబడిన పిమ్మట పొందిన శ్రమలనుబట్టి దేవునిని హృదయపూర్వకముగా స్తుతించుచున్నాను. 1927 సంవత్సరము నుండి 1935 సంవత్సరము వరకు ప్రతివిధమైన శ్రమను దేవుడు నా జీవితము లోనికి రానిచ్చెను. వాటినిబట్టి దేవునికి కృతజ్ఞతా స్తుతులను చెల్లించు చున్నాను. ఆయన నాకు కృప ననుగ్రహించెను. ఎప్పుడైనా సణిగినట్లు నాకు జ్ఞాపకము లేదు. అది నా యెడల దేవుని ఏర్పాటని నమ్మితిని. ఆ దినములలో ఆయన నాకు అనేక ఆత్మీ పాఠములను నేర్పించెను. ఆయన

నాకు వాస్తవమాయెను. నాకెంతో ప్రశస్తముగా నాయెను. ఈ పాఠములను ఏ పుస్తకము ద్వారా, కళాశాల ద్వారా నేర్చుకొనలేము.

జీవితములో గొప్ప కష్టమును ఎదుర్కొనినప్పుడు నీవు చింతించ నవసరము లేదు. తన సమయములో తన విధానములో దేవుడు నిన్ను విడిపించును. భూరాజులు అధికారమును చలాయించి ఘనత పొందవలెనని కోరుదురు. కాని పరలోక రాజైన మన ప్రభువు మనలను రక్షించి మనకు పరిచర్య చేయవలెనని కోరుచుండెను. దీనిని బయలుపరచుటకై ఒకప్పుడు తన పండ్రెండుగురు శిష్యుల పాదములను ప్రభువు కడిగెను. ఒకరికొకరము పరిచర్య చేసికొనుటకు మనముకూడ నేర్చుకొనవలెను. ప్రభువు మన శ్రమలను చూచెనని గుర్తించినప్పుడు మనము ఆదరింపబడి, దేవుని హృదయమునకు బహు సమీపముగా తేబడుదుము. దాని మూలమున ఆదరించుట ద్వారా ఇతరులకు పరిచర్య చేయగలుగుదుము.

## 5. షిమ్యోను :

పతకముమీది తరువాత పేరు షిమ్యోను. **షిమ్యోను** అనగా "యెహోవా వినెను" అని అర్థము (ఆది కాం. 29:33). "వారు వేడుకొనక మునుపే నేను ఉత్తరమిచ్చెదను. వారు మనవి చేయుచుండగా నేను ఆలకించెదను" (యెషయా 65:24) యని ప్రభువు వాగ్దానము చేసెను. సూచనల కొరకు, దర్శనముల కొరకు వేచియుండనవసరము లేదు. ఆయన వాగ్దానము నమ్మి నీ ప్రార్థనలు విని, జవాబు యిచ్చెనని వందనములు చెల్లించుము. "అందుచేత ప్రార్థన చేయునప్పుడు మీరు అడుగుచున్నవాటి నెల్లను పొందియున్నామని నమ్ముడి అప్పుడవి మీకు కలుగునని మీతో చెప్పుచున్నాను" (మార్కు 11:24) అని ప్రభువే సెలవిచ్చెను గదా! ప్రభువు మన ప్రార్థనలు విని ఉత్తరమిచ్చునను విశ్వాసమే శక్తివంతమైన ప్రార్థనయొక్క రహస్యము. దేవుని అనుమానించవద్దు.

**అసాధ్యముగా నున్నవాటిని సాధ్యపరచును. విశ్వాస జీవితము ఆనందమయమైన జీవితము. సమస్తమునకు దేవుని నమ్ముకొనవచ్చును**

మా అనుభవములో యీ విషయము సత్యమని చాల పర్యాయములు కనుగొంటిమి. కొన్ని దృష్టాంతముల నిచ్చెదను. మొదటి సారిగా 1954 సంవత్సరమున గుంటూరులో పరిశుద్ధ సమాజ కూడికల జరిపించుటకు నడిపింపబడితిమి. వాటి విషయమై ప్రభువు స్పష్టముగ మాట్లాడినందున తేదీలను నిర్ణయించితిమి. కాని ఆ సమయమునకు కూడికలకు కావలసిన వసతి సదుపాయములు లభించలేదు. అనుకూలమైన స్థలము కూడ దొరుకలేదు. 5000 మంది ప్రజలు కూడికలకు రావచ్చునని అంచనా వేసితిమి. అంత సమూహమునకు తొమ్మిది దినములు వసతి సదుపాయముల నేర్పరచుట సులభసాధ్యముగాదు. అయినను ప్రభువు తగిన వసతి నేర్పరచునని నమ్మితిమి. దాని విషయము కొంచెమైనను సందేహించలేదు.

ఒక ఉదయమున ప్రభువునందు ఒక సహోదరుడు నాయొద్దకు వచ్చి, పట్టణములో ఒక స్థలమును చూచుటకు తనతో రమ్మని కోరెను. మూడు మైళ్లు ప్రయాణము చేసి చౌదరి యను ఒక హైందవునికి చెందిన ఆవరణమును చేరితిమి. అతనిని కలిసికొని గుంటూరులో పరిశుద్ధ సమాజ కూడికలు జరిగించవలయునని మా కోరికను తెలిపితిమి. వెనువెంటనే అతడు తన జేబులో నుండి 25 రూ॥లు తీసి మా చేతిలో పెట్టబోయెను. చందా పోగుచేయుటకు మేము రాలేదనియు, వసతి కొరకు మాకు స్థలము కావలయుననియు అతనితో చెప్పితిమి. అతడు చాలా సంతోషముతో కొన్ని ఎకరముల విస్తీర్ణత గల తన ఆవరణమును, మూడు అంతస్థుల భవనములో పెద్ద పెద్ద గదులనుకూడ మాకిచ్చెదనని చెప్పెను. మేము పొందిన ఈ ఆశీర్వాద రహస్యమేమనగా అక్కర తీరకమునుపే మేము

ప్రభువు మాటను నమ్మితిమి.

ఈ కూడికలకు సిద్ధపాటు పనులు ప్రారంభించినప్పుడు ఆర్థికముగా మాయొద్ద పది రూపాయలు మాత్రమే యుండెను. అయినను మా అంచనా ప్రకారముగా కూడికలకు రానైయున్న ఐదువేల మంది జనులను పోషించు టకు కావలసిన సమస్తమును ప్రభువు అనుగ్రహించునని నమ్మితిమి. ప్రభువు మా విశ్వాసమును ఘనపరచి అక్కరలన్నింటిని తీర్చెను.

సమస్తమునకు ప్రభువును మనము నమ్ముకొనవచ్చును. ఒకసారి నేను బొంబాయి నుండి హైదరాబాదునకు ప్రయాణము చేయుచుంటిని. ఆ రైలుబండిలో బెర్తు దొరుకునేమోయని కనుగొనుటకు బుకింగు ఆఫీసుకు వెళ్లితిని. అక్కడనున్న గుమాస్తా లేదని చెప్పెను. కాని ప్రయత్నించి చూచెదనని అతనితో చెప్పి టికెట్ కొంటిని. రైలుబండి వచ్చిన పిమ్మట రెండు పెట్టెల యొద్దకు వెళ్లి విచారించితిని. ఖాళీలేదు గాని దేవుడను గ్రహించెను. బండి ముందుకు పోతిని. అక్కడ నొక రెండు బెర్తులున్న పెట్టెలో ఒక బెర్తు ఖాళీగా నుండుట చూచితిని. పెట్టెలో కూర్చుండియున్న ఒక ప్రయాణీకుని అడుగగా అది ఖాళీయేనని చెప్పెను. నేను లోపలికి వెళ్లుచూ అది ఖాళీయని అతనికెట్లు తెలుసునని ప్రశ్నించితిని. చిరునవ్వుతో అతడు "నేను ఒక టిక్కెట్టు ఒక బెర్తు కొరకు అడిగి, వాటికి డబ్బు చెల్లించితిని. అయితే వారెందులకు నాకు రెండు బెర్తులనిచ్చిరో తెలియదు. ఇది నీకొరకేనని నమ్ముచున్నాను" అని ప్రత్యుత్తరమిచ్చెను. నా జీవితములో అనేకమైన అట్టి సందర్భములలో నిదియొకటి. మన ప్రతి యక్కరను ప్రభువెట్లు తీర్చునో ఇది చూపించుచున్నది.

నలుబది సంవత్సరముల క్రితము నేను దేవుని సేవలోనికి వచ్చి నప్పటినుండి దేవుడు నా అక్కర తీర్చని సందర్భమొకటైనను లేదు. కొన్ని సంవత్సరముల క్రితము ఒక సువార్త దండయాత్రలో ఒక బహిరంగ

ప్రదేశము నిమిత్తము వారమునకు 335 రూ॥లు అద్దె చెల్లింపవలసి యుండెను. గనుక మౌనముగ నేను గదిలో ప్రార్థించుచుంటిని. "ప్రభువా నీ మహిమార్థమే కూటములు జరుపుచుంటిమి. సకాలమునకు అద్దె చెల్లించవలెను. దయచేసి మూడు దినములలోగా కావలసిన డబ్బును పంపించుము" మూడవ దినమున క్యాలికట్ నుండి ఒక ఉత్తరము వచ్చెను. అందులో యీలాగు వ్రాయబడియున్నది "నా కుమార్తె కోరిక ప్రకారము 335 రూ॥లు మనియార్డరు ద్వారా మీకు పంపుచున్నాను. ఆమె చాలా దినములనుండి రోగియై యుండెను. రెండు వారముల కంటె ఎక్కువకాలము నుండి ఆమెకు స్పృహ లేకుండెను. చివరికి ఆమె కన్నులు తెరచి మీకేమైనా పంపించమని కోరెను. ఇంటిలో డబ్బు ఏమీ లేదని నేనామెతో చెప్పితిని. తన బంగారు గొలుసు అమ్మివేయమని ఆమె నన్ను కోరెను. నేను బంగారు గొలుసు అమ్మి డబ్బును మీకు పంపుచున్నాను". ఆ అద్దె చెల్లించుటకు యీ డబ్బు సరిపోయెను.

ప్రభువు విషయములో సంశయించకుము. ఏమైన ఆలస్యమైన యెడల ఆయనను ప్రశ్నించకుము, కలవరపడకుము. ప్రభువు నీ ప్రార్థన వినెనని నమ్ముము. ప్రభువు నీ విశ్వాసము చొప్పున నీకు ప్రతిఫలమును గ్రహించును. కొందరు ప్రార్థన చేయుదురుగాని ఆ తరువాత దుఃఖ ముఖములతోనే యుందురు. ప్రభువు వారి ప్రార్థన వినెనని వారు నమ్ముట లేదని యిది చూపించుచున్నది. అట్టివారిని పోలి బలహీనమైన విశ్వాసము కలిగి యుండవద్దు. ప్రభువు నీ మొర వినెనని నీవు నిజముగా నమ్మిన యెడల నీకు జవాబిచ్చినందుకు వందనములు చెల్లించుము.

ఆయన ప్రేమగల దేవుడు గనుక ఎన్నడును తప్పిపోడు. మనము దేవుని ఎంతగానో అనుమానించి మనుష్యునిపై నాధారపడుట ద్వారా అధిక బాధననుభవించుచుందుము గదా! ప్రభువు మన పాపముల కొరకు

మరణించెననియు, మనలను ప్రేమించి మనలను రక్షించుటకు, విమోచించుటకు తనకున్న సమస్తమును త్యజించెననియు మనము నమ్మిన యెడల నిశ్చయముగా ఆయన మనలను విడనాడడు. "ఇదిగో... సదాకాలము మీతోకూడ ఉన్నాను" (మత్తయి 28:20),. "నిన్ను ఎన్నడును ఎడబాయను" (హెబ్రీ 13:5) అని ఆయన సెలవిచ్చెను గదా! దేవుని హృదయ సామీప్యతను అనుభవించుటకు ఈ అయిదవ ఆత్మీయ అనుభవము అవసరమై యున్నది.

## 6. గాదు :

పతకముపైని రెండవ వరుసలో చివరి రాతిమీద "గాదు" అను పేరుండెను. **"గాదు"** అనగా సైన్యము వచ్చుచున్నదని భావము (ఆది కాం. 30:11). "గాదు" తన తల్లియైన జిల్పాకు మొదటి కుమారుడు. అతని వెంట ఒక సైన్యము వచ్చుచున్నదని "లేయా" నమ్మెను. స్వల్పముగా కన్పించుచున్న దానిలో ఆమె గొప్పదానిని చూచెను. మనముకూడ అల్పముగా కనిపించు ప్రారంభమును మించి దానివెనుక జరుగనైయున్న గొప్ప కార్యములను చూడనేర్చుకొనవలెను. దృష్టాంతమునకు యోహాను 4:4లో యేసుక్రీస్తు ప్రభువు గలిలయకు వెళ్లుటకు యూదయను విడిచి బయలుదేరెనని చదువుచున్నాము. గలిలయకు రెండు త్రోవలు కలవు. ఒకటి సమరయ ద్వారా పోవును, మరియొకటి కర్మెలు పర్వతము ద్వారా పోవును. యూదులు ఎన్నడును సమరయ ద్వారా ప్రయాణము చేయరు (యోహాను 4:9). కాని యేసుక్రీస్తు ప్రభువు సమరయ ద్వారా వెళ్లగోరెను. "నేను సమరయద్వారా వెళ్లుటకు నిశ్చయించితిని" అని ప్రభువు శిష్యులతో చెప్పెను. "ఆ మార్గమున ఎందుకు పోవలెను? మనకు భోజన పానాదు లెవరు యచ్చెదరు?" అని శిష్యులు అడిగిరి. "ఆయన సమరయ మార్గమున వెళ్లవలసి వచ్చెను" అని లేఖనము నందున్నది. దానికి గల

కారణమేమి? ఒక స్త్రీ నిమిత్తము ఆయన అక్కడకు వెళ్లెను. ద్వారా సమరయ ప్రాంతమంతయు కదలింపబడెను. ఒక్క ఆత్మ ఆ ప్రదేశ మంతటిని ఆయన సంపాదించుకొనెను (యోహాను 4:39, అపొ. కార్య 8:5-8).

పెద్ద పెద్ద గుంపుల ద్వారా ప్రభువు అధికముగా పనిచేయునని తలంచు చుందుము. అది దేవుని విధానము కాదు. ఆయన చిన్నచిన్న వాటి ద్వారా గొప్ప కార్యములను నెరవేర్చెను. ఒక దినమున ఒక మనుష్యుడు కన్నీటితో మమ్మును చూడవచ్చెను. "నా భార్య చాల జబ్బుగా నున్నది. దయచేసి ఆమెకొరకు ప్రార్థించండి" అని అతడు మమ్మును కోరెను. అతడొక హిందువుడు. మేము ఆమె యొద్దకు వెళ్లి, చిన్న వర్తమానమిచ్చి ప్రార్థించి వచ్చితిమి. ప్రభువు ఆ స్త్రీని స్వస్థపరచెను. ఆమె భర్త ద్వారా ఆ ప్రాంతములో అనేకమంది ప్రభువు నొద్దకు వచ్చిరి. మరియొక సందర్భమున మద్రాసులో ఒక స్త్రీ నన్ను చూడవచ్చెను. "ఆస్పత్రిలో నా భర్త చాల జబ్బుగా నున్నాడు. దయచేసి ఆయన కొరకు ప్రార్థించండి. వైద్యులు ఆయనను స్వస్థతపరచలేక పోవుచున్నారు" అని ఆమె నాతో చెప్పెను. కొన్ని నిమిషములు మాత్రమే ప్రార్థనలో గడిపి, చిన్న వర్తమానమిచ్చి వచ్చితిమి. ఆ తరువాత హైదరాబాదు నుండి వచ్చిన ఆ కుటుంబమంతయు సహవాసము కొరకు వచ్చిరి. 1950వ సంవత్సరములో హైదరాబాదుకు రమ్మని నాకు వ్రాసిరి. ఆ రీతిగా దేవుడు పెద్ద కార్యము ద్వారా కాక చిన్న కార్యము ద్వారా హైదరాబాదు నగరములో పనిచేయుటకు ఆరంభించెను. "గాదు" నుండి ఈ పాఠము నేర్చుకొనుచున్నాము.

* * *

# 9

# ఎఫ్రాయిము, మనష్షే, బెన్యామీను

ఇశ్రాయేలీయులలో ఏడవ గోత్రమే ఎఫ్రాయిము. ఎనిమిదవ గోత్రమే మనష్షే. "ఎఫ్రాయిము" అనగా "నాకు బాధ కలిగిన దేశమందు దేవుడు నన్ను ఫలింపజేసెను"(ఆది కాం. 41:51, 52). "మనష్షే" అనగా "మరచిపోవుట" యని భావము. యోసేపు తన కుమారులకు ఈ పేర్లు పెట్టినప్పుడు వారి విషయమై దేవుడెట్టి తలంపును కలిగియుండెనో అతడు గుర్తించలేదు. వారి అక్కర, వారి శ్రమలు, బాధలు, కష్టముల విషయమై అతడు తలంచలేదు. వారి భవిష్యత్తు నిమిత్తము తానెట్టి పరలోక ఉద్దేశమును కలిగియుండెనో తన ప్రజలకు చూపించు నిమిత్తము దేవుడు యోసేపు కుమారులను తన జతపనివారినిగా వాడుకొనెను.

## 7. ఎఫ్రాయిము

ఎఫ్రాయిము అనగా ఫలించుట యని భావము. మనము ఎంతో సమృద్ధిగా ఫలింపవలెనని ప్రేమగల దేవుడు కోరుచుండెను. అట్టి ఫలవంతమైన జీవితము సులభము కాదు. నీవు దేవుని హృదయమునకు సమీపముగా నుండకోరిన యెడల ఆత్మీయముగా అధికముగా ఫలించుటకు సిద్ధపడవలెను. మొదటిదిగా ఆయనయందు నిలిచియుండుట ద్వారా నీవు ఫలించగలవు (యోహాను 15:4). రెండవదిగా చెట్ల కొమ్మలలో జీవరసము ప్రవహించు రీతిగా ఆయనయొక్క జీవము ఎడతెగక నీలో ధారాళముగా ప్రవహించవలెనని కోరుట ద్వారా నీవు ఫలించగలవు. కొన్ని పర్యాయములు ఏదో ఒక రోగము వచ్చినందువలన చెట్లకొమ్మలు కొన్ని ఎండిపోవును. యేసుక్రీస్తు ప్రభువు యొక్క జీవము ధారాళముగా, సమృద్ధిగా ఎల్లప్పుడు ప్రవహించగలుగునట్లు నిన్ను నీవు ఎడతెగక పరీక్షించు

కొనవలెను. ఆయన జీవము నీలో ప్రవహించకున్న యెడల పరీక్షించుకొని ప్రవాహమును ఆపివేయుచున్న పాపమును ఒప్పుకొని ప్రభువుయొక్క క్షమాపణను కోరుకొనుము.

మూడవదిగా "ఫలించు ప్రతి తీగె మరి ఎక్కువగా ఫలింపవలెనని దానిలోని పనికిరాని తీగెలను తీసివేయును" (యోహాను 15:2) అని చదువుచున్నాము. తోటమాలి ద్రాక్షావల్లియొక్క తీగెలను కత్తిరించుటను గమనించుము. ద్రాక్షపండ్లు గుత్తులు గుత్తులుగా కాయునట్లు ఒక్కొక్క తీగె కత్తిరించబడును. లండను నగరమందలి హేమ్టను కోర్టు భవనములో సుమారు 200 సంవత్సరాల క్రితము ఒక ద్రాక్షావల్లిని నాటిరి. అది చాలా పురాతనమైన ద్రాక్షావల్లి. అయినను అది కుంభాకారములోనున్న విశాలమైన గది నిండుగా నుండుటచే చూడ నద్భుతముగా నుండును. కాపు కాలములో వేలకొలది గుత్తులు వ్రేలాడుచుండుట చూడగలము. బహు జాగ్రత్తగా కత్తిరింపబడుచుండుటచే 200 సంవత్సరముల కొలది అది కాపునిచ్చుచుండెను. ఫలించగలుగుటకు మనము కత్తిరింపబడి, శుద్ధి చేయబడవలెనని మన ప్రభువు పలుకుచుండెను. కత్తిరించి, శుద్ధిచేయు విధానము జాగరూకుడైన తోటమాలికి మాత్రమే తెలియును. అందువలననే మనలను అత్యధికముగా ఫలింపజేయుటకు బాధించు దుఃఖములను, పరీక్షలను ప్రభువు రానిచ్చును. ఆయన అట్లు చేయునది మనలను శిక్షించుటకు కాదు.

దేవుడు ఇబ్బందుల ద్వారా యోసేపును ఫలింపజేసెను. యాకోబు యోసేపును దీవించుచున్నప్పుడు అతని ఫలించు స్థితిని గురించి పేర్కొనెను. "యోసేపు ఫలించెడి కొమ్మ, ఊటయొద్ద ఫలించెడి కొమ్మ, దాని రెమ్మలు గోడమీదికి ఎక్కి వ్యాపించును" (ఆది కాం. 49:22). యోసేపు ఎట్లు ఫలించగలిగెను? వారితో సహకరించి, వారి దురలవాట్లలో పాలుపొందుటకు

నిరాకరించినందున చిన్నప్పటినుండి అతడు తన సోదరులచేత ద్వేషింప బడెను. వారి తండ్రియైన యాకోబు యోసేపును ప్రేమించినందున వారు అసూయపడిరి. వారు అతనిని చంపదలచిరి గాని చివరికి అతనినొక దాసునిగా అమ్మివేసిరి. ఆ రీతిగా నతడు ఐగుప్తు చేరి పోతీఫరు గృహములో దాసుడాయెను. అచ్చట నతడు అపనిందలపాలై చెరసాలలో వేయబడెను. కొన్ని సంవత్సరములు అతని విషయము అందరును సంపూర్ణముగా మరచిపోయిరి. దాదాపు పదిహేను సంవత్సరములు అతడా శ్రమలను పొందెను. అతడు ముప్పది సంవత్సరముల ప్రాయములో నున్నప్పుడు దేవుడతనిని లేవదీసి ఫరోదయ పొందునట్లు చేసెను.

పదిహేను సంవత్సరముల శ్రమకాలము వ్యర్థముగా పోలేదు. యోసేపును ఒక ఉన్నత స్థానము కొరకు సిద్ధపరచుటకు దేవుడా కాలమును వాడుకొనెను. ఆహార కొరత కాలములో ఆహార పదార్థములను పంపిణీ చేయుటకు నమ్మకమైన, సమర్థులైన అధికారులు అనేకులు ప్రభుత్వము నకు కావలసి యుండును. కాని అధికారులలో లంచగొండితనము ఉండుట వలన ఆహార సమస్యను సరియైన రీతిగా తీర్చలేక పోవుచున్నారు. ఎంతో ఆహారము వ్యర్థము చేయబడుచున్నది. ప్రజలు బాధపడుచున్నారు. కాని యోసేపు ఒంటరిగా ఏడు సంవత్సరముల కరువుకాలమంతయు ఐగుప్తునకు మాత్రమేగాక ఇతర దేశములకు కూడ ఆహారమును అందించ గలిగెను.

కీర్తనలు 105-16-22లో యోసేపు దాసుడుగా, ఖైదీగా శ్రమ ననుభవించి, తుదకు రాజుచేత విడిపింపబడి, "ఇష్టప్రకారము అతడు తన అధిపతులను ఏలుటకును, తన పెద్దలకు బుద్ధి చెప్పుటకును తన యింటి యజమానునిగాను, తన యావదాస్తి మీద అధికారిగాను అతనిని నియమించెను" అని చదువుచున్నాము. సాధారణముగా అధిపతులు

(ప్రభుత్వ అధికారులు), పెద్దలు (పార్లమెంటు సభ్యులు) లంచములు తీసికొనుచు మోసగాండ్లగుదురు. వారిలో లంచగొండితనము, మోసము బట్టి ఫరో కూడ తన ఉద్యోగులను నమ్మలేకపోయెననుటకు ఎట్టి సందేహము లేదు. కనుక అతడు లంచములు తీసికొను అధిపతులను, పెద్దలను శిక్షించుటకు సంపూర్ణ అధికారమును యోసేపునకిచ్చెను. వీరు ధనవంతులుగా పలుకుబడి గలవారై యుండవచ్చును. యోసేపు వారిని క్రమశిక్షణలోనికి తెచ్చుటెట్లు? అది చాల కష్టమైన పని. కాని యోసేపు తన శ్రమల ద్వారా క్రమశిక్షణను పొందెను. కనుక నతడు గర్విష్టులైన, మూర్ఖులుగా నున్నవారికి బుద్ధి చెప్పగలిగెను. అట్టి కష్టతరమైన పనికి యోసేపును యోగ్యునిగా చేయు నిమిత్తము దేవుడు అతనిని పదిహేను సంవత్సరములు శ్రమల ద్వారా తీసికొని పోయెను.

బాల్య దశనుండి యోసేపు సంపూర్ణముగా దేవునిపై నాధారపడుటకు నేర్చుకొనెను. అతడు బంధువులచే విడచిపెట్టబడెను. స్నేహితులచే మరువబడెను. కొన్ని సమయములందు అతనికి సహాయపడువారు గాని, సానుభూతి కనపరచువారుగాని లేకపోయిరి. ధైర్యపరచునట్టి లేక అదరించునట్టి పత్రిక ఒక్కటైనను అతనికి రాలేదు. ఆ దినములలో ప్రభువు అతనికి ప్రశస్తముగా మారెనెనియు, ఎక్కువ సమయము నతడు ప్రార్థనలో అన్యోన్య సహవాసములో ప్రభువుతో గడపెననియు నమ్ముచున్నాను. ఆ రీతిగా ఒక దినమున పొందబోవు ఉన్నత పదవికి యోసేపును ప్రభుత్వ తర్ఫీతు చేసెను.

దేవుడతనిని మరచిపోలేదనియు, విడనాడలేదనియు, నిత్యము అతడిని ప్రేమించుచుండెననియు, అతనికి చేయుచున్నదానిని పూర్తిగా యెరిగియే చేయుచుండెననియు యోసేపు స్పష్టముగా గ్రహించగలిగినందున, దేవుడు అతనికి కుమారుని అనుగ్రహించి దీవించినప్పుడు అతనికి

'ఎఫ్రాయిము' అను పేరు పెట్టెను. అదే రీతిగా మనముకూడ అనేక శ్రమల ద్వారా ఆయన హృదయమునకు సమీపముగా రావలయునని కోరుచుండెను. ఈ లోకములోనేగాక రాబోవు లోకములోకూడ ఉన్నత పదవి నిమిత్తము ప్రభువు మనలను సిద్ధపరచుచుండెను. ఈ శ్రమలు ఎంత బాధాకరములైనను, వాటినిబట్టి ఎల్లప్పుడు ప్రభువును స్తుతించవలెను. ఇట్టి శ్రమలన్నిటి ద్వారా నీవు పోయిన యెడల సామాన్యమైన జీవితమునే నీవు కొనసాగించుదువు. కాని ఆయన రాజ్యములో ప్రభువుతో ఉన్నత పదవిని నీవు పొందగోరిన యెడల ప్రభువు యోగ్యమని ఎంచు ప్రతిశుద్ధీకరించు అగ్నివంటి పరీక్ష ద్వారా వెళ్లుటకు నీవు ఇష్టపడవలెను.

ప్రతి విశ్వాసి ఎట్టి మినహాయింపు లేక శ్రమల ద్వారా వెళ్లవలసి యున్నది. లేఖనములలో నున్న అనేక దేవుని పరిశుద్ధులు తీవ్రమైన అనేక శ్రమల ద్వారా పోవలసి వచ్చెను. అనేక పరీక్షల ద్వారా వెళ్లిన పిదప, "విశాలమైన స్థలమునకు ఆయన నన్ను తోడుకొని వచ్చెను" (దా.కీ. 18:19) అని పలికెను. అపొస్తలుడైన పౌలు కూడ తాను పొందవలసి వచ్చిన నలువదికంటె ఎక్కువైన కష్టతరమైన అనుభవముల జాబితాను ఇచ్చెను (2 కొరింథీ. 11:23-30). ఆ తరువాత ఆయన ఇయ్యనైయున్న గొప్ప బాధ్యతల కొరకు తర్ఫీతు చేయబడి, సిద్ధపరచబడు ఘనతను మనకిచ్చినందులకు దేవుని స్తుతించవలెను.

## 8. మనష్షే :

ఎఫ్రాయిము తరువాత మనష్షే పేరు వచ్చెను. (సంఖ్యా కాం 2:20). మనష్షే అనగా "మరచిపోవుట"యని అర్థము. "నా సమస్త బాధను నాతండ్రి యింటివారినందరిని నేను మరచిపోవునట్లు చేసెను" (ఆది కాం. 47:51) అని యోసేపు పలికెను. గతించిన కాలమును యోసేపు మరచిపోయినట్లుగా మనముకూడ మరచిపోవలెను. భవిష్యత్తులో మేలైన

వాటికొరకు ఎదురుచూడవలయును (ఫిలిప్పీ 3:13). మానవుల సానుభూతి పొందు నిమిత్తమై గత శ్రమలను గురించి సంతోషముతో మాట్లాడు చుందుము. "గత సంవత్సరములలో ఎంత బాధ ననుభవించితిమో చూడుము, నావంటి అసంతోషకరమైన గృహము మరెవరికి యుండదు. నా యింటి పరిస్థితి, నా తల్లిదండ్రుల, స్నేహితుల పరిస్థితి నీవెరిగిన యెడల నేనెంతగా శ్రమపడుచున్నానో నీవే గుర్తించుదువు" అని చెప్పు చుందుము. ఆత్మీయముగా ఎదుగుటకు గతములో వచ్చిన ప్రతివిధమైన శ్రమను మనము సంపూర్ణముగా మరచిపోవలెను.

కొన్ని పర్యాయములు అనేక సంవత్సరముల క్రితము ప్రభువు మనకు చేసిన దానిని మననము చేసికొని సంతోషించుచుందుము. పది, పదిహేను సంవత్సరముల క్రితము జరిగిన విషయములను ఉత్సాహముతో యితరులకు వివరించి చెప్పుచుందుము. కొన్ని పర్యాయములు ఆ మంచి దినములను తలంచుకొని కన్నీరు విడిచి మరల అట్టి దినముల కొరకై ఆశించుచుందుము. దంపతులు వారి వివాహ జీవితముయొక్క ఆరంభ మాసములను లేక సంవత్సరములను జ్ఞాపకము చేసికొని అట్టి దినములు మరల వచ్చినయెడల బాగుండుననుకొందురు. అయితే రాబోవు దినములలో ప్రభువు ఎట్టి గొప్ప ఆశీర్వాదములను వారికియ్యనై యుండెనో గ్రహించరు. బహుశ ప్రభువు నీకు చాలా మేలుచేసి యుండవచ్చును. నీ పక్షముగా గతములో గొప్ప కార్యములు చేసి యుండవచ్చును. భవిష్యత్తులో అంతకంటె శ్రేష్ఠమైన వాటిని ఆయన చేయునని మరువవద్దు. ఆ గొప్ప కార్యముల కొరకు ఆశతో ఎదురుచూడుము. పౌలు "ముందున్నవాటికై వేగిరపడుచున్నాను" అని పలికెను. శ్రేష్ఠమైన వాటికొరకు ముందుకు సాగిపోవుచున్నప్పుడే ప్రభువు నీకు ఆనందమిచ్చును. నీ విశ్వాసము సజీవముగా నుండును. అట్టి విశ్వాసము, నిరీక్షణ నిన్ను దేవుని హృదయమునకు సమీపముగా నుంచును.

ఆయన తన సంపూర్ణతతో మనలను నింపి తన పరిపూర్ణత లోనికి నడిపించితేనేగాని ఆయనకు తృప్తి కలుగదు. మన సంపూర్ణ ఆత్మీయ స్వాస్థ్యమైన తన రాజ్యమంతయు ఆయన మనకియ్యగోరుచున్నాడు. అందువలననే మనము ముందుకు సాగిపోవలెనని కోరుచుండెను. గత దినములను గూర్చి తలపోయుచు ఏడు, ఎనిమిది సంవత్సరముల క్రితము మనము ఉండిన రీతిగానే జీవించ ప్రయత్నించిన యెడల అది ఆత్మీయ ఎదుగుదలకు ఫలవంతమైన జీవితమునకు అభ్యంతర కారణమగును.

మనకందరికి "మనస్షై" అనుభవము అవసరము. ఏమి జరిగినను భవిష్యత్తులో ప్రభువు మనకు శ్రేష్ఠమైనవాటి నొసగునని జ్ఞాపకముంచుకొన వలెను. "సమస్తమును మీవి" (1 కొరింథీ, 3:21, 22) అని ప్రభువు సెలవిచ్చెను. గనుక మన నిమిత్తము నిత్యత్వము నుండి యేర్పాటు చేసి, వాటిని మనము సంపూర్ణముగా పొందవలెనని ఆయన కోరుచుండెను. ఈ మాటలను ఊరకనే పల్లించుట మాత్రము చాలదు. ఆయన వాగ్దానమును చేపట్టవలయును. "నిశ్చయముగా నేను నిన్ను ఆశీర్వదింతును. నిశ్చయముగా నిన్ను విస్తరింప జేసెదను" (హెబ్రీ. 6:14) అని ప్రభువు సెలవిచ్చెను. ఇవి దేవుని వాగ్దానము. ఆ వాగ్దాన ప్రకారము నిత్యత్వము వరకు ఆయన తన ఆశీర్వాదములను సమృద్ధిగా మనపై క్రుమ్మరించుచుండును. ఈ కారణమును బట్టియే అది ఎంత మంచిదైనను గతమును మరచిపోయి గొప్ప విషయములు జరుగునని నిరీక్షించవలెను. ఆయన రాజ్యములో, సింహాసనములో మన పరలోక స్వాస్థ్యము యొక్క సంపూర్ణ భాగమును కోరుకొనుచుండవలయును.

ఒక అద్భుత విషయమేమనగా మనము ఆయన విషయములో తప్పిపోయి, ఆయనను దుఃఖపరచినను మనము ఆశీర్వాదములను కోల్పోవుట ఆయనకిష్టము లేదు. అందువలననే మనము శుద్ధీకరింపబడు

టకు తగిన యేర్పాటును ఆయన ప్రశస్త రక్తములో చేసెను. శుద్ధీకరింప బడిన పిమ్మట ఆయన సిద్ధపరచిన సమస్తమును భవిష్యత్తులో మన కనుగ్రహించును.

## 9. బెన్యామీను :

ఎఫ్రాయిము, మనష్షేల తరువాత బెన్యామీను పేరు వచ్చును (సంఖ్యా కాం.2:22). "బెన్యామీను" అను పేరునకు "కుడిచేతిపుత్రుడు" అని భావము (ఆది కాం. 39:18). రాహేలు మరణ సమయములో గొప్ప బాధలో నున్నప్పుడు తనకు క్రొత్తగా పుట్టిన కుమారునికి "బెనోని" అను పేరు పెట్టెను. 'బెనోని' అనగా 'నా దుఃఖకుమారుడు' అని అర్థము. కాని యాకోబు అతని పేరును మార్చి "బెన్యామీను నా కుడిచేతి పుత్రుడు" అను పేరిడెను. బెన్యామీను దుఃఖముతో పొందుటలేదుగాని శక్తిని, బలమును పొందబోవుచున్నాడను తాత్పర్యముతో యాకోబు ఆ పేరు పెట్టెను. ప్రతి పనికి కుడిచేయి ఎక్కువ సహాయకరముగా నుండును. కొందరు మాత్రమే ఎడమచేతిని ఉపయోగించుచుందురు. అతడు దుఃఖములో పుట్టినందున కడపటికి తన కుమారుడు అధిక బలమును, ఆనందమును పొందునను భావముతో ఇతడు "నా కుడిచేతి పుత్రుడు" లేక "నా బలముయొక్క పుత్రుడు" అని యాకోబు పలికెను. బెన్యామీను తల్లి ప్రసవ సమయములో మరణించినందున అతడు తల్లిప్రేమను రుచించలేకపోయెను. కాని ఆ తరువాత బెన్యామీను ద్వారానే అతని సోదరులు యోసేపు యొక్క దయను పొందగలిగిరి. యోసేపు తన సోదరుల ద్వారా ద్వేషింపబడినను బెన్యామీనును చూచినవెంటనే అతని హృదయము కరిగిపోయెను. వారందరిని క్షమించి వారికి బహుమతులుకూడ యిచ్చెను.

దేవుని కుడి హస్తము నొద్దకు మనలను నడిపింప చేయు

దుఃఖములను బెన్యామీను అను పేరు సూచించుచున్నది. దుఃఖము ఎంతో ప్రశస్తమైన, విలువైన అనుభవము. ఇదియే మనలను ప్రభువునకు సమీపముగా తెచ్చి ఆయన బలమును అనుభవించునట్లుగా చేయును. మిక్కిలి దుఃఖభరితమైన అనుభవములద్వారా ప్రభువు మనలను నడిపించ వచ్చును. చిన్న వయస్సులోనే మన తల్లిదండ్రులను ఆయన తీసుకొన వచ్చును. మన పిల్లలనో, భర్తనో, భార్యనో లేక మన ప్రియులనో ఆయన తీసికొనవచ్చును. ఇట్టివి మనకెందులకు సంభవించవలయునో గ్రహించ లేకపోవచ్చును. కాని కలిగిన దుఃఖములద్వారా దేవుని అనుగ్రహము పొందగలము. దేవుని సేవకులలో అనేకులు లేత వయస్సులోనే మహిమలోనికి పిలువబడుట చూచితిమి. స్తెఫను యౌవన ప్రాయములోనే రాళ్లతో కొట్టబడి చంపబడినట్లు అపొస్తలుల కార్యములలో చదువు చున్నాము. అతడు బలమైన గొప్ప దైవజనుడుగాను, సహవిశ్వాసులకు గొప్ప సంతోషకారణముగాను ఉండెను. తాను వాడైన సౌలు స్తెఫను మరణమునకు సహాయకుడుగా, సాక్షిగా నుండెను. ఆ సమయమునుండి అతడు దర్శనమును పొంది, "తండ్రీ, వీరిని క్షమించుము" అని ప్రకాశ మానమైన ముఖముతో స్తెఫను పలికిన మాటలను మరచిపోజాలక పోయెను. తరువాత పౌలు కూడ క్రీస్తు నిమిత్తము అధికముగా శ్రమలపాలు కావలసి వచ్చెను (2 కొరింథీ. 11:24-28). స్తెఫనుయొక్క విజయవంతమైన మరణమే పౌలును బలమైన సాక్షిగా మార్చెనని చెప్పవచ్చును. పౌలు కూడ తాను రాళ్లతో కొట్టబడవలసిన సమయము వచ్చినప్పుడు ఎంతో సంతోషముతో సహించెను. అదే రీతిగా కొరడా దెబ్బలను, దారిద్ర్యమును, సముద్రములో ఓడ పగిలిపోయినప్పుడు కలిగిన ఉపద్రవములను ఆనందముతో భరించెను. ఆ రీతిగా ప్రభువు తన పరిశుద్ధుల శ్రమలు, మరణముల ద్వారా, అనేకులకు ఆశీర్వాదము, రక్షణ కలుగజేసెను. దృష్టాంతమునకు, ఢిల్లీలోని సహోదరుడు జి. సామ్యేలు గారు పెద్ద వయస్సు

రాకపూర్వమే మహిమలోనికి పిలువబడిరి. మేము భూస్థాపన కూటము జరిపించుచున్నప్పుడే వర్షము ఆరంభమయ్యెను. భూస్థాపన స్థలమునకు మృతదేహమును తీసికొని వెళ్ళుచున్నప్పుడు కూడ వర్షము కురియుచునే యుండెను. వర్షము కుంభవృష్టిగా కురియుచున్నప్పటికిని హిందువులు, మహమ్మదీయులైన అనేక పెద్ద పెద్ద ఉద్యోగులు సమాధి నొద్దకు వచ్చిరి. "ప్రభువా, దయచేసి వర్షము నాపుచేయుము" అని ప్రార్థించితిమి. మేము భూస్థాపన స్థలమును సమీపించు సమయమునకు వర్షము ఆగిపోయెను. మేము కూటము ముగించువరకు వాతావరణము తేటగా నుండెను. ప్రభువు అంత బలముగా కార్యము చేసిన మరొక భూస్థాపనను నేను చూడలేదు. ఆ భూస్థాపనకు వచ్చినవారి జీవితములలో ప్రభువు ఆ దినమున ఏమిచేసెనో నిత్యత్వములోనే తెలిసికొనగలము.

ఎంతో బాధాకరమైన అనుభవములద్వారానే యితరుల భారములను భరించుటకు నేర్చుకొందుము. ఇదియే దేవుని కుడిచేతి యొద్దకు మనలను నడిపించి ఆయన అనుగ్రహమునకు పాత్రులనుగా చేయును. నీకు కలుగు దుఃఖకరమైన అనుభవములన్నిటికి ప్రియుల మరణమే కారణము కాకపోవచ్చును. నీ బంధువులు లేక మిత్రుల యొద్దనుండి నీవు ప్రేమ, ఆదరణలను అపేక్షించగా వారు నిన్ను అపార్థము చేసికొని, నీకు నిరాశ కలిగించి ద్రోహము చేసినందున నీకు దుఃఖము కలిగియుండ వచ్చును. తన దక్షిణ హస్తముచెంతకు నిన్ను రాబట్టుకొనుటకే దేవుడు ఈ అనుభవములన్నింటిని నీ జీవితములోనికి రానిచ్చెను. "బెనోని - నా దుఃఖ పుత్రుడు" అను అనుభవమునుండి "బెన్యామీను - నా కుడిచేతి పుత్రుడు" అను అనుభవమునకు నిన్ను నడిపింప కోరుచుండెను.

☆ ☆ ☆

# 10
# దాను, ఆషేరు, నఫ్తాలి

## 10. దాను :

ప్రధాన యాజకుని పతకములో చివరి పంక్తియైన నాలుగవ పంక్తిలో నున్న ప్రశస్తమైన రాళ్లయొద్దకు వచ్చుచున్నాము. ఈ పంక్తిలో మొదటి రాతిమీద "దాను" గోత్రపు పేరుండెను (సంఖ్యా కాం. 2:25). "దాను" అనగా "దేవుడు నా తీర్పరి" యని అర్థము (ఆది కాం. 30:6). విశ్వాసులముగా మనము మనలను ద్వేషించి, శపించి, కీడు చేయువారిమీద పగ తీర్చుకొనరాదు. మనలను అబద్ధముగా నిందించినప్పుడు ఎదురాడ కూడదు (రోమా 12:19). మన విషయమై ప్రజలేమి చెప్పుచున్నను ఫరవాలేదు. దేవుడే మన తీర్పరి గనుక మనము ఆయనకే విడిచిపెట్ట వలయును. కొన్ని పర్యాయములు ఆయన తీర్పు ఆలస్యముగా వచ్చును. ఉదాహరణకు యెజెబెలు తనను చంప ప్రయత్నించుచున్నది గాన దేవుడు వెంటనే ఆమెను హతమార్చునని ఏలియా తలంచెను. కాని అది దేవుని విధానము కాదు. చివరకు ఆ దుర్మార్గురాలైన రాణిని శిక్షించుటకు తన సమయము వచ్చువరకు దేవుడు యెజెబెలునకును, ఆహాబునకును పశ్చాత్తాప పడుటకు అవకాశమిచ్చుచుండెను.

చాలా సంవత్సరాల క్రితము కరాచీలోని ఒక పాస్టరు అబద్ధముగా నన్ను నిందించుచు అనేక వ్యాసములు వ్రాసెను. వాటిని అచ్చు వేయించి మన దేశములోను, విదేశములలో కూడ పంచిపెట్టెను. వాటి విషయము కొందరు నాతో చెప్పిరి గాని నేమాత్రమును లక్ష్యపెట్టలేదు. వాస్తవమునకు నేనతని కలుసుకొన్నప్పుడెల్లను అతనితో చేతులు కలిపి స్నేహముగా మాట్లాడుచుండుటచే నాకు విరోధముగా అతడు చేసినవి నేనెరుగుదునని

కించిత్తైనా అతడు ఊహించలేదు. ఆ పాస్టరు చేయుచున్న వాటియొక్క సత్యాసత్యములను వెల్లడిచేయు నిమిత్తము అతనిమీద వ్యాజ్యెము వేయు అధికారము తనకిమ్మని నా స్నేహితుడొకడు నన్ను కోరెను. "లేఖనముల ప్రకారము కోర్టుకు వెళ్లుటకు మనకు ఎట్టి అధికారము లేదు. మనకు హాని చేయువారికి హాని చేయకూడదు. దానికి ప్రతిగా ఆ వ్యక్తి కొరకు ప్రార్థించి, అతని దీవించవలెను. దేవుడే మన తీర్పరి. నన్ను ఎట్లు కాపాడ వలయునో, ఆతనికి ఎట్లు తీర్పు తీర్చవలయునో ప్రభువే ఎరుగును" అని నేను బదులు చెప్పితిని. కొంతకాలమైన పిదప ఆ పాస్టరు చాలా జబ్బుపడెను. అతని దేహమంతటను, పెదవులమీద సహితము బొబ్బలు పుట్టెను. నేనతనిని చూడవెళ్లి అతనికొరకు ప్రార్థించితిని. అతడు నా చేతులు పట్టుకొని క్షమాపణ నడిగెను. ఆవిధముగా ప్రభువు తన సమయములో అతనికి ప్రతీకారము జేసెను. ప్రజలు నిన్ను గురించి అసహ్యమైన మాటలు పలికినప్పుడు నీవు ఎదురాడకుము. వారికెట్టి కీడు తలపెట్టకుము. దేవుడు నీ నిర్దోషత్వమును బయలుపరచి, వారికి తగిన తీర్పు తన సమయములో తీర్చును. ఆయన ప్రేమగల దేవుడు. నిన్ను విడనాడడు. నీమట్టుకు నీవు ప్రభువు చెంతకు చేరి యితరులకు తీర్పు తీర్చకుండుము.

## 11. ఆషేరు :

పతకములోని రాళ్లమీద చెక్కబడిన పదనొకండవ పేరు ఆషేరు (సంఖ్యా కాం. 2:27). "**ఆషేరు**" అనుమాటకు "నేను సంతోషించుచున్నా నని భావము". "స్త్రీలు నన్ను భాగ్యవతి అందురుగదా"అని లేయా పలికెను (ఆది కాం. 30:13). దేవుడే మన సంతోషము కాని మన తలాంతులు, ఈవులు, పరిచర్య సంతోషమునియ్యజాలవు. ఆత్మీయ జీవితారంభములో బైబిలు జ్ఞానము పొందవలెనని లేక సూచక క్రియలు చేయవలెనని కోరుదుము. స్వస్థపరచు వరమును పోలిన అసాధారణమైన వరము

నాశించెదము. కాని ఆ తరువాత అవన్నియు సంతోషము నియ్యలేవని గుర్తెరుగుదుము. ప్రభువే మన సంతోషము. ఆయన సముఖములో నుండి ఆయనతో మాట్లాడుట ఎంతో ఆధిక్యత. "నీ సన్నిధిని సంపూర్ణ సంతోషము కలదు; నీ కుడిచేతిలో నిత్య సుఖములు కలవు" (కీ.కీ. 16:11). ఆయన సన్నిధిలో ఆయన వాక్యము చదువుచు, ఆయనను ఆరాధించుచు, పూజించుచు, ఆయనతో అన్యోన్య సహవాసమునందు గడిపిన సమయము నీ జీవితమందలి అత్యధిక సంతోషకరమైన సమయమని నీవు గమనించి యుందువు. ఈ సంతోషము లోకమందలి యితర సంతోషములతో పోల్చలేము.

భారతదేశములోని గుడులను కొల్లగొట్టిన ఒక రాజును గురించిన నిజమైన ఒక కథ కలదు. అతడు సింధునదిని దాటిన తరువాత తన సిపాయిలతో "అనేక సంవత్సరములు మీరు నాతో శ్రమ ననుభవించితిరి గనుక మీ నమ్మకత్వమునుబట్టి మీకు బహుమానము లియ్యగోరుచున్నాను. మీకిష్టమైనది మీరు కోరినంత తీసుకొనవచ్చును" అని చెప్పి వజ్రములు, రత్నములు మొదలగు విలువైన రాళ్లు కలిగిన సంచులను విప్పి వారి యెదుట నుంచెను. అందరు తమతమ భాగములను తీసికొనుటకు ముందుకు వెళ్లిరి కాని ఒక సిపాయి రాజుచెంతనే నిలువబడి యుండెను. "నీవుకూడ వెళ్లి ఆ ధనమును తీసికొనుము" అని రాజు ఆ సిపాయితో పలికెను. కాని ఆ సిపాయి "నేను నిన్ను కోరుకొనుచున్నాను. ఇవి నా కవసరము లేదు. నీతోనే యుండు భాగ్యము నాకు దయచేయుము" అని జవాబిచ్చెను. తుదకు యితరులందరికంటె ఆ సిపాయికి అధికముగా లభించెను. రాజు మరణించిన పిదప రాజునకు చెందినవన్నియు సిపాయి వాయెను. వారు కలిగియున్నవే లేక వారికి అవసరమైనవే ఆశీర్వాదమని అనేకులు తలంచుదురు. "ప్రభువా నాకిది దయచేయుము లేక అది దయచేయుము" అని వేడుకొనుచుందురు. వీరికి యేసుక్రీస్తు ప్రభువు

అవసరము లేదు. ఆయనే శ్రేష్ఠ యీవుల నిచ్చు దాత. ఆయనయందలి విశ్వాసము ద్వారా మనము సమస్తమును పొందగలము. ఆయనను మనము అధికముగా ప్రేమించి, ఘనపరచుకొలది సమస్తము వాటంతట అవే మనకు లభించును, ఆయనే మన ఆషేరు. ఆయనే మన నిజమైన సంతోషము.

## 12. నఫ్తాలి

పతకములోని చివరి రాతిమీద "నఫ్తాలి" అను పేరు గలదు నఫ్తాలి అను పేరునకు "దేవునితో పోరాడుట" యని యర్థము (సంఖ్యా కాం. 2:29; ఆదికాం. 30:8). యాకోబు దేవునితో పోరాడి, "నీవు నన్ను ఆశీర్వదించితేనేగాని నిన్ను పోనియ్యను" అనెను. అబ్రాహాము సొదొమ గొమొఱ్ఱాల కొరకు భక్తిపూర్వకముగా పట్టుదలతో విజ్ఞాపన చేసెను లోకమందు పలు భాగములలో చెదరియున్న దేవుని సేవకుల నిమిత్తము దేవుని ప్రజల నిమిత్తము, ప్రసవ వేదనతో దేవుని సన్నిధిలో విజ్ఞాపన చేయు భాగ్యము మనకుకూడ గలదు. ప్రతి స్థలమునకు వ్యక్తిగతముగా పోలేము గాని ప్రార్థించగలము (ఎఫెసీ. 6:18). అట్టి విజ్ఞాపనయే దేవునితో పోరాడుట. ఆయా ప్రజలయొక్క అక్కరలు, సమస్యలు, శ్రమలు మనము తెలిసికొన్నప్పుడు వారి నిమిత్తము దేవునితో పోరాడుట కారంభించవలెను. మన ప్రార్థనా వలయము పెద్దది యగుకొలది మనము దేవుని హృదయము నకు సమీపముగా చేరుట గుర్తించగలము.

అనేక సంవత్సరముల క్రితము నేను కెనడా దేశములో విక్టోరియా పట్టణమందుంటిని. ఒక దినమున ఒక వృద్ధ స్త్రీ యొద్దనుండి సందేశము వచ్చెను. ఆమె వెన్నెముక విరిగినందున ఆమెకు పిండికట్టు వేయబడెను. ఎక్కువ కాలము ఆమె బాధలో నుండెను. ఆమె నివసించుచున్న చిన్న గదికి ఆమెను చూచుటకు నేను వెళ్లగా ఆమె నాతో యిట్లనెను, "ఈ

రీతిగా ప్రభువు నన్ను పడకలో నుంచినందులకు ఆయనకెంతో కృతజ్ఞు రాలను . అనేకమంది దైవసేవకుల నిమిత్తము ప్రార్థించుటకు చాలా సమయము నాకు దీనివలన లభించినది". కొన్ని సంవత్సరములకు పూర్వము మిషనెరీగా విదేశములకు ఆమె పోగోరెను గాని ఏదోనొక కారణమునుబట్టి అట్లు చేయలేకపోయెను. "కాని ఇప్పుడైతే నేను బాధలో నుండి నిద్ర పోలేనప్పుడు లోకములోని వివిధ ప్రాంతాలలో నున్న దేవుని సేవకుల నిమిత్తము ప్రార్థించుటకు ప్రభువు నాకు జ్ఞాపకము చేయు చుండెను" అని ఆమె చెప్పెను. ఇట్టి పరిచర్యను దేవుడు ఆమెకు అనుగ్ర హించెను. విక్టోరియా ఒక రేవు పట్టణమగుటచే అనేక దేశములనుండి వచ్చి పోవుచున్న ఓడలు ఆ రేవులో నాగుచుండును. ఆవిధముగా అనేక దేశములనుండి మిషనెరీలు ఆ పట్టణము మీదుగా పోవుచుందురు. ఈ సహోదరి, ఆ పట్టణము మీదుగా పోవుచున్న మిషనెరీల జాబితా పెట్టుకొని తనను చూచివెళ్లుమని వారి నాహ్వానించుచుండును. నా గురించి ఎవరో నామెకు తెలియచేయగా నన్నుకూడ ఆహ్వానించెను. నేనామెను చూడ వెళ్లినప్పుడు, సంతోషముతో ఆమె ముఖము ప్రకాశించుచుండెను. చాలా సంవత్సరములనుండి నాకొరకు ప్రార్థించుచున్నట్లు ఆమె నాతో చెప్పెను. ఆమె ప్రార్థనలకు జవాబుగా దేవుడు చేసిన గొప్ప కార్యములను, ఆమె విజ్ఞాపన చేయుచున్న పరిశుద్ధులు, దేవుని సేవకులందరి జీవితములలోను, వారి ద్వారాను దేవుడు నెరవేర్చినవాటిని నిత్యత్వములో మాత్రమే తెలిసికొన గలము. అదియే నఫ్తాలి. ప్రార్థనలో పోరాడు ఇట్టి ఆధిక్యత మనకందరికి గలదు.

రైలు ప్రయాణము ప్రార్థనకెంతో సహాయకరముగా నుండునని కనుగొంటిని. ప్రపంచమంతటిలోనున్న అనేకుల రక్షణ, కాపుదల, అభిషేకము నిమిత్తము ప్రార్థించుచు రాత్రంతయు గడుపుచుండెడి వాడను. రద్దీగా నున్న రైళ్లలో రిజర్వేషను లేకుండా ప్రయాణము చేయునప్పుడు

కూడా ప్రార్థనలో సమయమును ప్రయోజనకరముగా గడపవచ్చును. ఆ విధముగా మన అసౌఖ్యమును 'పరచిపోయి, యితరుల నిమిత్తము ప్రార్థించుట యందానందించుచుం దుము. ఆ రీతిగా దేవుని హృదయ సామీప్యతను పొందగలుగుచున్నాము.

"ప్రభువా, దయచేసి యూదా, ఇశ్శాఖారు, జెబూలూను, రూబేను షిమ్యోను, గాదు, ఎఫ్రాయిము, మనష్షే, బెన్యామీను, దాను, ఆషేరు నఫ్తాలి అనుభవములను నాకిమ్ము. నన్ను నీ హృదయమునకు సమీపముగ నుంచుము. ఈ ప్రశస్తమైన రాళ్లవలె నన్ను చేయుము. నీ సంపూర్ణతల నా భాగము నిమిత్తము నన్ను ఆయత్తపరచుము" అని విశ్వాసముతో వేడుకొనుము. ఆయన నీ కోరిక ప్రకారము చేయునని నమ్ముము.

* * *

# 11
# ఊరీము - తుమ్మీము

పండ్రెండు ప్రశస్తమైన రాళ్లుగల పతకము వెనుక ఊరీము, తుమ్మీములు కలవు (నిర్గ కాం. 28:30). ఎవరి నిమిత్తమైనను, ఏ సందర్భములోనైనను, ఎట్టి సమయమందైనను ఈ రాళ్ల సహాయముతో దేవుని చిత్తమును ప్రధాన యాజకుడు కనుగొనుచుండెను (సంఖ్యా కాం. 27:21). ఈ రాళ్లు పనిచేయు విధానము ఎల్లప్పుడు మర్మముగానే యున్నది. ప్రధాన యాజకునికి తప్ప ఇంకెవరికిని అవి కనబడవు. అవి ప్రధాన యాజకుని వస్త్రములలో చాలా ప్రాముఖ్యమైన భాగము. పాత నిబంధన కాలములో దేవుని చిత్తమును కనుగొనుటకు అది ఒకటే మార్గము. అందువలననే దావీదు దేవుని చిత్తమును ఊరీము, తుమ్మీముల ద్వారా కనుగొనుటకు ఏఫోదును తెమ్మని యెడతెగక ప్రధాన యాజకుడైన అబ్యాతారును కోరుట చూచుచున్నాము (1 సమూ. 23 : 2, 4, 9, 11).

నోబులోనున్న ప్రధాన యాజకుని యొద్దకు దావీదు వెళ్లినప్పుడు ప్రతిష్ఠితమైన రొట్టెలు, ఖడ్గము అతనికియ్యబడెను. సౌలు రాజునకు ఇది తెలియగా అతడు ఎనుబది అయిదుమంది యాజకులను సంహరించెను. కాని అబ్యాతారు తప్పించుకొని పోయెను. అతడు ఏఫోదును, ఊరీము, తుమ్మీములను తీసికొని ఆ సమయములో అదుల్లాముగుహలో దాగియున్న దావీదు నొద్దకు పోయెను (1 సమూ. 22:1, 20, 22). కష్టములలో, ఇబ్బందులలో నున్నవారందరు దావీదుతో నుండుటకై ఆ గుహను చేరిరి. అచ్చటనే దావీదు దేవుని అనుభవపూర్వకముగా ఎరిగెను. దావీదు ఆ గుహలో నుండియే 34, 57, 107, 108 కీర్తనలను వ్రాసెను. దేవుని ఏర్పాటును కనుగొను మర్మమును అతడచ్చట నేర్చుకొనెను. చిన్నచిన్న విషయములలోకూడ దావీదు ప్రధాన యాజకుని యొద్దనున్న

రెండు రాళ్లు కలిగిన ఏఫోదు ద్వారా దేవుని మనస్సును తెలిసికొనుటకు ఆరంభించెను. (1 సమూ. 23:1-5, 13). ఇట్టి అధికృత అందరికి అందుబాటులో నుండినను దేవుని చిత్తమును కనుగొనుటకు కొద్దిమంది మాత్రమే ప్రధాన యాజకుని యొద్దకు వెళ్లుచుండెడివారు. పలుమార్లు మనముకూడ అలాగే చేయుచుందుము. అనేక పొరపాట్లు చేసి, అనేకమార్లు తప్పిపోయిన తరువాత, "ఓ ప్రభువా, ఈ దినమున నీ చిత్తము కనుగొను టకు సహాయము చేయుము" అని ప్రార్థించుదుము. ఈ పాఠమును ఆరంభములోనే మనము నేర్చుకొనవలెను.

యేసుక్రీస్తు ప్రభువు మన సజీవమైన ప్రధాన యాజకుడు. ఇప్పుడు మనమెల్లరము ఆయనద్వారా దేవుని చిత్తమును కనుగొనగలము. మోకరించి ఆయన చిత్తమును తెలియజేయుమని దేవుని విశ్వాసముతో వేడుకొనవలెను. దేవుని హృదయమునకు బహు సమీపముగా మన ముండిన యెడల చిన్న విషయములలో కూడ దేవుని చిత్తమును సులభ ముగా కనుగొనగలము. ఉదాహరణకు సరకుల కొరకు బజారు వెళ్లునప్పుడు సమయము వ్యర్థము చేయనవసరము లేదు. చివరికి సర్వసాధారణముగా జరుగు రీతిగా అంగడివాడిచేత మోసగింపబడనవసరము లేదు. "ప్రభువా, నేను ఫలానివి కొనగోరుచున్నాను. దయచేసి నన్ను సరియైన దుకాణము నకు తీసికొని పొమ్ము. నా సమయమును, డబ్బును, శక్తిని వ్యర్థము చేయనియ్యకుము". అని ప్రార్థించిన యెడల ఆయనే సమస్తమును నిర్వ హించును. బేరమాడుటలో సమయము వ్యర్థము చేయనవసరముండదు. ఆ తరువాత పొందిన నష్టము విషయమై విచారింపనవసరముండదు.

దేవుని చిత్తమును కనుగొనుటకు ప్రధాన యాజకునియొద్ద ఊరీము, తుమ్మీము అను రెండు రాళ్లు వున్నట్లుగా, యేసుక్రీస్తు ప్రభువు నొద్దకూడ రెండు రాళ్లున్నవి (దా.కీ. 43:5). యేసుక్రీస్తు ప్రభువే మన జీవము, వెలుగు, సత్యము (యోహాను 8:12; 14:6). రక్షకుడుగా మనలోనికి

వచ్చునప్పుడు ఆయన సత్యవాక్యమగును. అందువలననే మనము తిరిగి జన్మించినప్పుడు దేవుని వాక్యము కొరకు అసాధారణమైన ఆకలి కలిగి యుందుము. అనుదినము చదువుచుండినను మనకు విసుగురాదు. తిరిగి జన్మించకముందు లోక పుస్తకములు, పత్రికలు, నవలలు, ప్రీతితో చదువుచుండెడివారము గాని ఇప్పుడు ఉదయము, మధ్యాహ్నము, సాయంకాలము దేవుని వాక్యమునే కోరుదుము. సజీవమైన రక్షకుడు మనలో వుండని యెడల దేవుని వాక్యమును అనుభవించలేము. యేసుక్రీస్తు ప్రభువును అనుభవించిన తరువాత పరిశుద్ధత మనకు వాస్తవమైనదగును. దేవుని వాక్యమును నిదానముగా, క్రమముగా, ప్రార్థనా పూర్వకముగా చదువునప్పుడు దేవుని యేర్పాటు, దేవుని చిత్తము మనకు బయలుపడును. యేసుక్రీస్తు ప్రభువు మన జీవము, విశ్వాసము, ఈలాగందుము. "యేసు ప్రభువా, నా నేత్రములను తెరువుము. నీ దైవ జీవమును అనుగ్రహించుము. సంగతులను స్పష్టముగా చూచుటకు సహాయము చేయుము". ఆయన దైవజీవము మరియు వాక్యము సహాయముతో చిన్న విషయములకు కూడ దేవుని చిత్తమును కనుగొన గలము. దేవుని చిత్తమును ఎరుగుట, దానిని చేయుటయే విశ్వాసికి మహాభాగ్యము.

దేవుని చిత్తమును నెరవేర్చుటలోనే యేసుక్రీస్తు ప్రభువు తన జీవిత మంతటిని గడిపెను (యోహాను 4:34; 5:30; 6:38). ఆయన ప్రేమను, మక్కువను అనుభవించి, ఆయన హృదయమునకు సమీపముగా రాగోరిన యెడల ఆయన చిత్తము నెరిగి, దానిని నెరవేర్చుటకు నేర్చుకొనవలెను. దేవుని చిత్తమును చేయుట ద్వారానే ఆయన సన్నిధిని అనుభవించగలము. ప్రధాన యాజకుడు ఊరీము, తుమ్మీము అను రాళ్లను కలిగియుండి వ్యక్తులకు, కుటుంబములకు, జనాంగమంతటికి దేవుని చిత్తమును కనుగొనినట్లు ఇప్పుడు యేసుక్రీస్తు ప్రభువు మన ఊరీము, తుమ్మీము అని నమ్ముచున్నాము. మన హృదయములోనికి వచ్చిన యేసుక్రీస్తు ప్రభువు

మన పరలోకపు ప్రధాన యాజకుడు. ఆయనే మన జీవము, సత్యము గనుక దేవుని వాక్యమును మన హృదయములో చేర్చుకొనుట ద్వారా, దైవజీవమును విశ్వాసముతో అంగీకరించుటద్వారా, ఆయన మనకు సమస్తములో సమస్తమగును.

దేవుని వాక్యమును చదువునప్పుడు దా.కీ. 119 : 1-8లో వ్రాయబడిన రీతిగా, "నేను నీ ధర్మశాస్త్రమునందు ఆశ్చర్యకరమైన సంగతులను చూచునట్లు నా కన్నులు తెరువుము" అని ప్రార్థించవలెను. "ఓ ప్రభూ! నా కన్నులు తెరువుము. నీ దైవజీవమును నాలో పోయుము. నీ వాక్యమందలి దాచబడిన మర్మములను చూడనిమ్ము. నేటికొరకు, రేపటి కొరకు నీ త్రోవను చూపుము" అని ప్రార్థించుటవలననే దైవ వెలుగును పొందగలము. దేవుని వాక్యమును చదువుట వలననే దైవవెలుగు మన హృదయములలోనికి వచ్చును. దేవుని స్వరమును స్పష్టముగా వినగలము.

దైవజనుడైన ఏలియా దేవుని ప్రవక్త. అతడు ప్రార్థించగా అగ్ని దిగివచ్చెను (1 రాజులు 18:38). అతడు ప్రార్థించగా మూడున్నర సంవత్సరములు వర్షము ఆగిపోయెను. తిరిగి అతడు ప్రార్థించగా వర్షము వచ్చెను. అదే ప్రవక్త బదరీ వృక్షము క్రింద కూర్చుండి, "యెహోవా, నా పితరులకంటె నేను ఎక్కువవాడను కాను; ఇంతమట్టుకు చాలును. నా ప్రాణము తీసికొనుము" అని ప్రార్థన చేసెను (1 రాజులు 19:4). అతడు నిరుత్సాహపడెను. కారణమేమి? అతడు దేవుని మనస్సును ఎరుగకుండెను. దేవుడు ఒక ఉన్నతమైన పర్వతము మీదికి అతనిని తీసికొనిపోయి అనేక సంగతులను చూపించెను. దేవుడు పెనుగాలిలోగాని, భూకంపములోగాని కనపడలేదు. ఆయన అగ్నిలోగాని, తుఫానులోగాని ప్రత్యక్షము కాలేదు. చివరికి మిక్కిలి నిమ్మళముగా మాటలాడు స్వరము వినబడెను. అప్పుడు దేవుడు ఏమి చేయనైయుండెనో, యెజెబెలునకు, ఆమె సహచరులకు

ఆయన ఎట్లు తీర్పు తీర్చునై యుండెనో గ్రహించెను. ఈ రీతిగా నతడు భయములనుండి, సందేహములనుండి విడిపింపబడి దేవుని చిత్తమును స్పష్టముగా చూడగలిగెను.

దేవుని స్వరము వినుట ద్వారానే దేవుని మందిర నిర్మాణములో దేవుని జతపనివారముగా పాలి భాగస్థులము కాగలము. దేవుని ప్రార్థించు టయు, ఆయన స్వరము వినుటయు మన అనుదిన అభ్యాసముగా నుండవలెను. మొట్టమొదట మనము తిరిగి జన్మించినామో లేదో నిశ్చయము చేసికొనవలెను. రెండవదిగా ఆయన సన్నిధిని నిశ్చయము చేసికొనవలెను. ఎందుకనగా ఈ అధికృతను మననుండి ఎట్టి పాపమైననూ దొంగిలించగలదు. ఏలియా వృద్ధాప్యములో నిరుత్సాహమొందిన రీతిగా మనముకూడ ఆయనవలె కావచ్చును. మన హృదయములను పవిత్రముగా నుంచుకొనవలెను. దురాశ, శత్రుత్వము, అపవిత్రత మొదలగువాటికి మనము మాసముగా నుండవలెను. అనుదిన అభ్యాసము ద్వారా దేవుని స్వరమును వినగలము. ఎట్టివిధమైన సమస్య కొరకైనను ఆయన యొద్దకు వెళ్లగలము.

దేవుని స్వరమును వినుటకు ఓపికతో ఆయన సన్నిధిలో మనము కనిపెట్టవలెను. ఊరీము, తుమ్మీముల ద్వారా దేవుని స్వరము విను విధానము దావీదురాజు ఎరిగి యుండెను. కాని ఆ తరువాత అతడు తొందర పడెను. దేవునియొద్ద విచారించకనే, ఆయన స్వరము వినకనే, సౌలుకు విరోధముగా ఫిలిష్తీయుల యొద్దకు వెళ్లి, వారితో చేరిపోయెను (1 సమూయేలు 29). కానివారు అతని అనుమానించి పంపివేసిరి. అతడును అతని అనుచరులును సిక్లగునకు వచ్చినప్పుడు వారి యిండ్లు కాల్చివేయబడి యుండుట చూచిరి. వారి స్త్రీలు చెరగా తీసికొని పోబడినారని తెలిసికొనిరి. వారి సొత్తంతయు తీసికొనిపోబడెను. అమాలేకీయులు అధిక సంఖ్యలో నుండిరి. కాని వీరు స్వల్పసంఖ్యలో నున్నందున, పోయిన వాటిని మరల

పొందగలమను ఆశ వారికి లేకపోయెను. దావీదు పశ్చాత్తాపపడి దేవుని యొద్దకు వెళ్లెను. దేవుడు అతనితో మాట్లాడి, నష్టము తీర్చెదనని వాగ్దానము చేసెను. దావీదు లోబడెను. ఊరీము, తుమ్మీముల ద్వారా దేవుని యొద్ద విచారించినందున అతడు సమస్తమును తిరిగి పొందెను.

ఆయన చిత్తమును చేయుమని దేవుడు మనలను బలవంత పెట్టడు. వివాహ విషయములోగాని లేక వ్యాపార విషయములోగాని లేక ఉద్యోగ సందర్భములోగాని ఆయన చిత్తమెరుగుటకు ఆయన యొద్దకు వెళ్లవలెను. కాని విచారకరమైన సంగతులేమనగా బహు కొద్దిమంది విశ్వాసులు మాత్రమే దేవుని సంప్రదించు అధిక్యతను వాడుకొనుచుందురు. ఎందుకనగా విశ్వాసులు ఓపికతో ఆయనయొద్ద కనిపెట్టి యుండరు. దాని ఫలితము - అసంతోషము, పతనము, ఆత్మీయముగా చెవిటివారుగా, గ్రుడ్డివారుగా నుందురు. దేవుని యొద్దకు మరలివచ్చుట ద్వారానే మనము సమస్తమును తిరిగి పొందగలము.

గనుక మనమీలాగు ప్రార్థించుదుము – "ప్రభువా, పంప్రెండు ప్రశస్తమైన రాళ్లద్వారా సూచింపబడుచున్న పంప్రెండు అనుభవములద్వారా నన్ను తీసికొని వెళ్లుము. నీవే నాకు ఊరీము, తుమ్మీముగా నుండుము. స్వల్ప విషయములలోకూడ నీ చిత్తమెరుగటకు, నీ స్వరము వినుటకు నాకు సహాయము చేయుము. నీ హృదయమునకు సమీపముగా నన్నుంచుము". అప్పుడు మన జీవితములు విజయవంతమగుట మనము చూడగలము. మన ద్వారా బయలుపడనైయున్న ఆయన మహిమా సౌందర్యములలో పాలివారమగుదుము.

✹ ✹ ✹

# 12

# తలపాగా

ప్రధాన యాజకుని వస్త్రములలో తలపాగా ఒకటి (నిర్గ కాం. 28:36-38). తలపాగా సుందరమైన తెల్లని నారతో చేయబడెను. ప్రధాన యాజకుని వస్త్రములలో ఇది ఎంతో ముఖ్యమైనది. విశ్వాసులకు అనుగ్రహింపబడిన సర్వాంగ కవచములోని భాగములు, ఆత్మీయ ఆయుధముల జాబితా ఎఫెసీ 6:14-17లో చదువుచున్నాము. వాటిలో నొకటి రక్షణ శిరస్త్రాణము. ప్రధాన యాజకుని తలపాగా రక్షణ కిరీటమును సూచించుచున్నది (ఎఫెసీ. 6:17). యేసుక్రీస్తు ప్రభువును రక్షకునిగా మనము అంగీకరించినప్పుడు దేవుని కరుణా కటాక్షములు, ప్రేమా మక్కువలు మనకు కిరీటముగా ననుగ్రహింపబడును (దా.కీ. 103:4).

గొప్ప ప్రేమతో దేవుడు మానవుని సృష్టించెను. సూర్యచంద్రాదులు కలుగజేయబడక ముందునుండియే తాను సిద్ధము చేయుచుండిన ఆశీర్వాదములను నిత్యత్వము కొరకు మానవుని కియ్యవలెనని దేవుడు తన హృదయములో సంకల్పించెను (1 కొరింథీ 2:9). పాశ్చాత్య దేశములలో యౌవన ప్రాయములలో నున్న బాలికలు భవిష్యత్తులో తమ గృహమునకు, తమకు కలుగబోవు శిశువునకు కావలసిన అన్నిరకములైన విలువగు సామగ్రి సేకరించుచుందురు. ప్రధానము జరుగకముందునుండియే, భవిష్యత్తులో భర్త ఎవరో తెలుసుకొనక ముందునుండియే వారట్లు చేయుట కారంభించుచుందురు. వారు సేకరించుచున్న వాటిని ఎవరిని చూడనియ్యరు. ఆ యౌవనస్థురాలు పుట్టబోయే బిడ్డకొరకు అధిక విశ్వాసము, నిరీక్షణలో, ప్రేమతో ఆలోచనాపూర్వకముగా సిద్ధము చేయు చుండును. "ఒక దినము నాకు వివాహమగును. నాకొక బిడ్డ జన్మించును.

ఆ బిడ్డకు కావలసిన వాటన్నిటిని నేను సిద్ధము చేయవలెను" అని ఆమె తలంచుచు, కలలు కనుచుండును. అదే రీతిగా, భూమి సృష్టింపబడక మునుపే దేవుడు నిన్ను నన్ను గురించి తలంచి, అనేక శ్రేష్టమైన వాటిని మనకొరకు సిద్ధపరచెను.

ఆదాము చేసిన పాపమువలన దేవుని ప్రేమద్వారా కలుగు ఆశీర్వాదములను, మేలులను అనుభవించు ఆధిక్యతను కోల్పోయితిమి. మన పాపముల విషయమై పశ్చాత్తాపపడి, క్రీస్తు ప్రభువునందు విశ్వాసముంచునప్పుడు యేసుక్రీస్తు ప్రభువునందు ఆ ఆశీర్వాదములన్నియు తిరిగి మన కనుగ్రహింపబడును. మనము పశ్చాత్తాపపడి, క్రీస్తునందు విశ్వాసముంచిన యెడల, ఆదాము పాపమువలన పోయిన దేవుని కరుణా కటాక్షముల కిరీటము, తిరిగి మనకిప్పుడు ఉచితముగా అందించబడునని ప్రధాన యాజకుని తలపాగా మనకు జ్ఞాపకము చేయుచున్నది.

ఆయన సంపూర్ణతతో మనము నింపబడవలెనని ప్రభువు కోరుచుండెను. క్రీస్తు ప్రేమ మహా సముద్రమువలె నున్నది (ఎఫెసీ 3:18,19). మన పాపములను క్షమించుటమాత్రమే గాక, తన సంపూర్ణతతో మనలను నింప కోరుచుండెను. ప్రధాన యాజకుని తలపాగా ద్వారా ప్రభువు ఈ వర్తమానమును అందజేయుచుండెను. "ఓ నా బిడ్డలారా, నా కరుణా కటాక్షములతో మిమ్ము కిరీటము ధరింపచేయ కోరుచున్నాను. నా సంపూర్ణతతో మిమ్ము నింపగోరుచున్నాను". ఆయనను మన ప్రభువుగా నంగీకరించి, శిరస్సుగా పరిగణించిన యెడల మన పరీక్షలలో తన ప్రేమ ఉద్దేశముల నన్నిటిని మన జీవితములలో నెరవేర్చి తన కరుణా కటాక్షములను, ప్రేమా వాత్సల్యములను కిరీటముగా ధరింపజేయును.

తలపాగా ద్వారా మరొక వర్తమానము మనకందజేయబడుచున్నది. అది కృపా వర్తమానము. "అయినను నేనేమై యున్నానో అది దేవుని కృప

వలననే అయియున్నాను. మరియు నాకనుగ్రహింపబడిన ఆయన కృప నిష్ఫలము కాలేదు గాని వారందరికంటె నేనెక్కువగా ప్రయాసపడితిని ప్రయాస పడినది నేనుకాను. నాకు తోడైయున్న దేవుని కృపయే" (1 కొరింథీ 15:10). మనలాంటి బలహీనులు, దుర్బలులు, బుద్ధిహీనులైన మానవులను తన సంపూర్ణతతో ఎందుకు నింపకోరుచుండెనో యని యాశ్చర్యపడుట సహజము. దేవుడు ఎందులకు మనలను తన సంపూర్ణతతో నింపగోరుచుండెను? జవాబు ఏమనగా - మనమేమై యున్నామో దానినిబట్టి కాదు, మన తెలివితేటలు లేక వరములు తలాంతులనుబట్టి గాక, తన కృప ద్వారానే ఆయన మనలను నింప కోరుచుండెను. పౌలు వంటి వ్యక్తి అట్టి సంపూర్ణతను పొందగలడు గాని నేను బలహీనుడను గనుక నాకు వీలుపడదని నీవు తలంచవచ్చును. తానేమై యుండెనో అది దేవుని కృప వలననేయని పౌలు తనంతట తానే ఒప్పుకొనుచుండెను. నీవు, నేనుకూడా ఆ రీతిగానే పొందగలము. నీ బైబిలు జ్ఞానము వలన లేక తెలివితేటల వలన లేక యితర యోగ్యతల వలన దేవుని సంపూర్ణతను పొందగలనని తలంచవద్దు. కేవలము ప్రభువు కృప ద్వారానే పొందగలము. కనుకనే కుటుంబము, విద్య లేక ఇతర విషయములందు మనమెన్నడును అతిశయించకూడదు. ఆయన మహిమా సౌందర్యములలో పాలివారము కాగోరిన యెడల ప్రతి విషయమునకు ఆయన కృప కోరుకొనవలెనని ప్రభువు చూపించుచుండెను. కేవలము ఆయన కృప ద్వారానే రక్షింపబడితిమి. ఆ తరువాత కూడ అనుదినము ప్రతి అక్కర నిమిత్తము అదే కృపను కోరుకొనవలెను.

కొన్ని పర్యాయములు మిక్కిలి బాధాకరములైన అనుభవముల ద్వారా ప్రతి సందర్భమునకు తన కృప చాలినదని ప్రభువు నేర్పించును (2 కొరింథీ 12:9). అపొస్తలుడైన పౌలు ఎట్టి సణుగు గొణుగులు లేకనే ఎన్నో కష్టములను అనుభవించెను (2 కొరింథీ 12:23). బాధాకరమైన

"శరీరములో ఒక ముల్లు" ద్వారా దేవుడు అతనిని శ్రమ ననుభవింప జేసెనని చదువుచున్నాము (2 కొరింథీ 12:7-9). అది ఎట్టి ముల్లో మనకు తెలియదు. "అది నా యొద్దనుండి తొలగిపోవలెనని దాని విషయమై ప్రభువును ముమ్మారు వేడుకొంటిని" అని పౌలు పలుకుచుండెను. గనుక అది మిక్కిలి బాధ కలిగించి యుండవచ్చును. మరి యే సందర్భములోను అతడట్లు ప్రార్థించలేదు. అతడు చెరసాలలో నున్నప్పుడు "ప్రభువా, చెరసాలనుండి నన్ను విడిపింపుము" అని ప్రార్థించలేదు. ప్రతి శ్రమను ఓపికతో భరించెను. కాని ఈ సందర్భములో ముల్లును తొలగించుమని ముమ్మారు అతడు ప్రభువును వేడుకొనెను. గనుక ఆ ముల్లు అధిక బాధను కలిగించునదని ఇది ఋజావు చేయుచున్నది. అట్టి సమయములో దేవుని జవాబు "నా కృప నీకు చాలును". మొట్టమొదటగా, అతని కియ్యబడిన దైవ ప్రత్యక్షతలనుబట్టి అపరిమితముగా హెచ్చిపోకుండునట్లు అతనిని దీనునిగా నుంచుటకు ఆ ముల్లు వాడబడెను. రెండవదిగా దానిద్వారా దేవుని కృపను గురించి మరి అధికముగా అతనికి నేర్పించ గోరెను. దీనిని సులభముగా గ్రహించ వీలుపడదు. పౌలు అనేక ప్రత్యక్షతలు, అద్భుతములైన అనుభవములు పొందినను దేవుని కృపను గురించి అధికముగా నేర్చుకొనుటకు శరీరములోని ముల్లు ద్వారా శ్రమ అనుభవింపవలసి వచ్చెను. ఆ రీతిగా దేవుడు తన కృపను గురించి అధికముగా నేర్పించుటకు తన బిడ్డలయొక్క జీవితములోనికి అన్ని రకములైన శ్రమానుభవములను రానిచ్చును.

మనము ఎంతో బలహీనులము, గనుక అనుక్షణము, ప్రతి పరిస్థితిలోను, దేవుని కృప మనకు కావలసి యున్నది. దినములో అనేక పర్యాయములు ఆయన విషయములో తప్పిపోయి ఆయనను దు:ఖపరచు చున్నాము. కాని దేవుడు ఎంతో కృపాసహితుడు. ఆయన కృపను బట్టి మనలను క్షమించి ప్రతిసారి మనలను పైకి లేవదీయును. సకాలమునకు

ఒక కష్టా టీ మనకందింపబడక పోయిన యెడల ఓపిక లేక కోపపడుదుము. మనమేమైయున్నామో, మేనమేమి యిచ్చుచున్నామో, మనమేమి చేయగలమో వాటిని బట్టి బహు సులువుగా అతిశయించుదుము. కేవలము దేవుని కృప ద్వారానే మనమిట్టి బలహీనతలన్నిటినుండి విడిపింపబడి, సంపూర్ణముగా, చివరకు ఆయన సారూప్యములోనికి, మహిమా సౌందర్యములలోనికి మార్చబడుదుము. మనమెట్టి ఆశీర్వాదమైనను ఆయన కృప ద్వారానే పొందవలెను. గనుక ఏ విధముచేతనైనను మనలో మనమే అతిశయపడకూడదు. దేవుని యెదుట మనము పురుగు వంటి వారమైనను దీనస్థితిలో నుండి లేవదీసి ఆ ఘనత కలిగిన స్థానమును మనకనుగ్రహించెను. దీనిని మనము గుర్తించుకొలది, అనుదినము మనమీద ఆయన క్రుమ్మరించుచున్న సమృద్ధియైన కృపనుబట్టి యెడతెగకుండ ఆయనను స్తుతించక యెట్లుండగలము?

ప్రధాన యాజకుని తలపాగామీద నొక రేకు యుంచబడెను (నిర్గ. కాం. 28:36). "యెహోవా పరిశుద్ధుడు" అనుమాట చెక్కబడెను. ప్రభువు నకు పరిశుద్ధులముగా నుండుట అనుదిన లక్షణముగా నుండవలెను. మన దేవుడు పరిశుద్ధుడు. ఆయన దహించు అగ్నిని పోలియున్నాడు (హెబ్రీ. 12:29). మనవంటి బలహీనులు ఆయన యెదుట ఎట్లు నిలువ గలరు? (మలాకీ 3:28). ఆయన పరిశుద్ధతలో మనము పాలివారము కావలయుననియు, మనము ప్రకాశమానమైన బంగారమువలె కావలయు ననియు దేవుడు కోరుచుండెను. ఇందు నిమిత్తమై ఎడతెగక ఆయన మనలను శిక్షింపవలసి యున్నది (హెబ్రీ 12:10, 11). ఇట్టి శిక్షణములన్నియు శుద్ధిచేయు అగ్నివలె నున్నవి. అట్టి శుద్ధీకరణ కార్యము సంపూర్ణమైన పిమ్మట ఈ భూమిపైననే గాక, పరలోకములో కూడ నిరంతరము యుగముల పర్యంతము ఆయన పరిశుద్ధతను వెల్లడి చేయగలము.

ఆ విధముగా అంతమున దేవుని మహిమా సౌందర్యములలో పాలు పొందుదుము, దేవుని సంపూర్ణతతో నింపబడుదుము.

"గొఱ్ఱెల గొప్ప కాపరియైన యేసు అను మన ప్రభువును, నిత్యమైన నిబంధన సంబంధమగు రక్తమునుబట్టి మృతులలో నుండి లేపిన సమాధాన కర్తయగు దేవుడు. యేసుక్రీస్తు ద్వారా తన దృష్టికి అనుకూలమైన దాని మనలో జరిగించుచు. ప్రతి మంచి విషయములోను తన చిత్త ప్రకారము చేయుటకు మిమ్మును సిద్ధపరచును గాక. యేసుక్రీ యుగయుగములకు మహిమ కలుగును గాక! ఆమేన్" (హెబ్రీ. 13:20, 21).

* * *